

# విభారె
## తెలుగు దినపత్రిక
## VIBHARE TELUGU DAILY







PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి బుధవారం 13 అక్టోబరు 2021 సంపుటి : 03 సంచిక : 62 పేజీలు : 4 వెల : రూ 3-00


# అవసరానికి రంగులు మార్చే వారి ప్రవర్తనతో దేశానికి హాని: ప్రధాని మోదీ



న్యూఢిల్లీ: జాతీయ మానవ హక్కుల సంఘం (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ఆయన ఆ కార్యక్రమంలో మాట్లాడారు. ట్రిపుల్ తలాక్‌కు వ్యతిరేకంగా ముస్లిం మహిళలు కొన్ని దశాబ్ధాలుగా చట్టాన్ని డిమాండ్ చేస్తున్నారని, ట్రిపుల్ తలాక్ చట్టాన్ని తెచ్చి వారికి కొత్త హక్కుల్ని కల్పించామని, హజ్ సమయంలో మహరమ్( మగ తోడు) నిబంధన నుంచి విముక్తి కల్పించినట్లు ప్రధాని మోదీ తెలిపారు. గత ఏడేళ్లలో 60 కోట్ల జనాభా క్షేమాన్ని చూసుకున్నట్లు ప్రధాని చెప్పారు. వారికి ఒకరు ఉన్నారన్న భరోసా ఇచ్చినట్లు తెలిపారు. పది కోట్ల మంది మహిళలకు టాయిలెట్లు ఏర్పాటు చేశామన్నారు. 4 కోట్ల ఇండ్లకు విద్యుత్తు సరఫరా కల్పించినట్లు వెల్లడించారు. సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్, సబ్‌కా ప్రయాస్ లక్ష్యంతో దేశం ముందుకు వెళ్తోందన్నారు. ప్రతి ఒక్కరి మానవ హక్కుల్ని రక్షించే మౌళిక సూత్రాల ఆధారంగా పనిచేస్తున్నామన్నారు. ప్రభుత్వం ఏదైనా స్కీమ్ రూపొందిస్తే, దాంతో కొందరికి మాత్రమే లబ్ధి చేకూరుతుందని, దాని వల్ల హక్కుల అంశం బయటకు వస్తుందని మోదీ అన్నారు. అందుకే అందరికీ పథకాలు అందే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నట్లు ప్రధాని చెప్పారు.సమానత్వ అంశంపై ప్రపంచానికి మన రాజ్యాంగం కొత్త దృక్పథాన్ని కల్పించిందని, గత కొన్ని దశాబ్ధాలుగా కొన్ని దేశాలు తమ లక్ష్యాల నుంచి దారిమళ్లాయని, కానీ ఇండియా మాత్రం తన సూత్రాలకు కట్టుబడి ఉన్నట్లు ప్రధాని తెలిపారు. ఉద్యోగం చేస్తున్న గర్భిణి మహిళలకు 26 వారాల మెటర్నిటీ లీవ్‌ను కల్పిస్తున్నట్లు ప్రధాని చెప్పారు. శిశువు హక్కుల రక్షణలో ఇది కీలకం అన్నారు. మహిళల రక్షణ కోసం 700 జిల్లాల్లో వన్‌స్టాప్ సెంటర్లను ఏర్పాటు చేశామని, వాటిల్లో మెడికల్, పోలీస్, మెంటల్ కౌన్సిలింగ్ ఉంటుందన్నారు. 650 ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేశామన్నారు. అత్యాచారం లాంటి హేయమైన నేరాలకు మరణశిక్షలను విధిస్తున్నట్లు ప్రధాని తెలిపారు.హక్కులు, విధుల అంశాలపై అవగాహన కల్పించాలని, ఈ రెండింటినీ ఒకే వేదికగా చర్చించాలని, వేరువేరుగా కాదన్నారు. కేవలం హక్కుల గురించి అవగాహన పొందడం కాదు, వారి వారి విధుల పట్ల కూడాప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని మోదీ అన్నారు. కొన్ని ఘటనల్లో కొందరు మానవ హక్కుల ఉల్లంఘన జరిగినట్లు భావిస్తారని, కానీ అలాంటి ఇతర ఘటనల్లో మాత్రం వాళ్ల అభిప్రాయాలు భిన్నంగా ఉంటాయన్నారు. రాజకీయ కోణంలో చూస్తేనే మానవ హక్కుల ఉల్లంఘన జరిగినట్లు అవుతుందని, ప్రజాస్వామ్యానికి సెలెక్టివ్ బిహేవియర్ హానికరమన్నారు. సెలెక్టివ్ బిహేవియర్‌తో వాళ్లు దేశ ప్రతిష్టకు భంగం కల్పిస్తారని మోదీ అన్నారు. అవసరానికి తగ్గట్లుగా రంగులు మారుస్తూ ప్రవర్తించేవారితో దేశానికి కీడు కలుగుతుందని ప్రధాని తెలిపారు.

# శ్రీవారి సేవలో జగన్..

### శ్రీవేంకటేశ్వర హిందీ, కన్నడ భక్తి ఛానల్స్ ప్రారంభం
### ముగిసిన సీఎం జగన్ రెండు రోజుల తిరుమల పర్యటన



తిరుపతి: రెండు రోజుల తిరుమల పర్యటన ముగించుకొని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు. సాలకట్ల బ్రహ్మోత్సవాల పర్యటనలో భాగంగా మంగళవారం ఉదయం శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న సీఎం జగన్‌కు మహా ద్వారం వద్ద టీటీడీ చైర్మన్, ఈఓలు స్వాగతం పలికారు. సీఎం జగన్ శ్రీవారి ధ్వజ స్తంభాన్ని నమస్కరిస్తూ ఆలయంలోకి ప్రవేశించి శ్రీవారిని దర్శించుకున్నారు. శ్రీవారికి బియ్యంతో తులాభారం మొక్కులు సమర్పించారు. సీఎం జగన్‌కు అర్చకులు వేద ఆశీర్వచనం ఇచ్చి, స్వామివారి తీర్థప్రసాదాలను అందచేశారు. శ్రీవారి దర్శనం అనంతరం సీఎం జగన్.. శ్రీవేంకటేశ్వర భక్తి చానల్‌కు సంబంధించి.. కన్నడ, హిందీ చానళ్లను ప్రారంభించారు. సీఎం జగన్ వెంట మంత్రులు కొడాలి నాని, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వెల్లంపల్లి శ్రీనివాస్,



నారాయణ స్వామి, అనిల్ కుమార్ యాదవ్, గౌతమ్ రెడ్డి, చెల్లుబోయిన వేణుగోపాల్, ఎమ్మెల్యేలు ఉన్నారు. చదవండి: బడితోనే అమ్మఒడి

బూందీ పోటును ప్రారంభించిన సీఎం జగన్

తిరుమలలో రూ.10 కోట్లతో నూతనంగా నిర్మించిన బూందీపోటు భవనాన్ని సీఎం జగన్ ప్రారంభించారు.

అటు తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నమయ్య భవన్‌లో రైతు సాధికార సంస్థ, టీటీడీ మధ్య జరిగే ఒప్పందం కార్యక్రమంలో పాల్గొన్నారు. సీఎం జగన్ సమక్షంలో టీటీడీ, రైతు సాధికార సంస్థ మధ్య ఎంవోయూ కుదిరింది. అనంతరం శ్రీ పద్మావతి అతిధి గృహం నుంచి రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు సీఎం జగన్.

# ప్రభుత్వాన్ని అప్రదిష్టపాలు చేసేందుకు టీడీపీ కుట్ర

### మంత్రి సీదిరి అప్పలరాజు

అమరావతి: ప్రభుత్వాన్ని అప్రదిష్టపాలు చేసేందుకు టీడీపీ కుట్రలకు పాల్పడుతోందని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు మండిపడ్డారు. ప్రభుత్వంపై బురద చల్లేందుకే టీడీపీ డ్రగ్స్ రాద్ధాంతం చేస్తోందన్నారు. మహిళాభివృద్ధి, సంక్షేమాన్ని టీడీపీ అడ్డుకుంటోందని మంత్రి ధ్వజమెత్తారు. కోర్టులకెళ్లి ప్రభుత్వ పథకాలను అడ్డుకుంటున్నారని నిప్పులు చెరిగారు. అధికారం కోసం వెన్నుపోటు పొడిచిన చరిత్ర చంద్రబాబుదన్నారు. "రాష్ట్రంలో పెద్ద ఎత్తున 'వైఎస్సార్ ఆసరా' ఉత్సవాలు జరుగుతున్నాయి. మహిళల అకౌంట్లో డబ్బులు జమ అవుతున్నాయి. ప్రజలకి ఫలితాలు దక్కకుండా ప్రతిపక్షం విశ్వప్రయత్నాలు చేస్తోంది. డ్రగ్ మాఫియా ఏపీ నుంచే జరుగుతుందని అసత్య ప్రచారం చేస్తున్నారు. ఎన్ఐఏ.. ఏపీకి సంబంధం లేదని తేల్చింది. ఇప్పుడు పేదలకు ఇళ్ల పథకంపై కోర్టుకెక్కి ఆపించారని" మంత్రి అప్పలరాజు మండిపడ్డారు.



# కీలక పదవుల భర్తీకి సీఎం జగన్ కసరత్తు... లిస్టులో ఉన్న నేతలు వీళ్లేనా..?

ఆంధ్రప్రదేశ్ లో మరోసారి పదవుల పందేరానికి రంగం సిద్ధమైంది. ఇప్పటికే నామినేటెడ్ ఎమ్మెల్సీ, స్థానిక ఎన్నికలు, కార్పొరేషన్లలో నామినేటెడ్ పదవుల ద్వారా వేలాది మందికి పదవులిచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తాజాగా మరికొన్ని కీలక పదవుల భర్తీకి రంగం సిద్ధం చేస్తున్నారు. అవే ఎమ్మెల్సీ పదవులు. ఏపీ శాసన మండలిలో 14 ఎమ్మెల్సీ స్థానల భర్తీకి సీఎం వైఎస్ జగన్ కసరత్తు చేస్తున్నారు. వీటిలో 11 స్థానిక సంస్థల ఎమ్మెల్సీలు, ముగ్గురు ఎమ్మెల్యే కోటా నుంచి ఎంపిక కానున్నారు. గత ఆరు నెలలుగా ఈస్థానాలు ఖాళీగా ఉంటున్నాయి. స్థానిక సంస్థ కోటాటు కోర్టు అడ్డంకులతో పాటు పరిషత్ ఎన్నికల ఫలితాలు కూడా రాకపోవడంతో సదరు ఎన్నికలు ముడిపడటం లేదు. వాటిలో వైసీపీకి 18 స్థానాలున్నాయి. ఖాళీగా ఉన్న 14స్థానాలు కూడా వైసీపీ ఖాతాలో పడే అవకాశాలున్నాయి. దీంతో మండలిలో ఆ పార్టీ బలం పెరగనుంది. దీంతో మండలి చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు కూడా అధికార పార్టీ ఖాతాలోకి వెళ్లనున్నాయి. ఖాళీగా ఉన్న ఎమ్మెల్సీ స్థానాలు దక్కించుకునేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వైసీపీ నేతలు ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఇప్పటికే కొంతమంది తాడేపల్లిలో లాబీయింగ్ చేస్తున్నట్లు తెలుస్తోంది.త్వరలో మంత్రివర్గంలో మార్పులు చేర్పులు ఉండనున్న నేపథ్యంలో సీఎం వైఎశ్ జగన్ కూడా ఎమ్మెల్సీ స్థానాలపై దృష్టిపెట్టారు. ఇప్పటికే ఆయా జిల్లాల నుంచి నేతలను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. వీరిలో ముఖ్యంగా మర్రి రాజశేఖర్ (చిలకూలురుపేట, గుంటూరు జిల్లా), ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు (గుంటూరు జిల్లా), బీద మస్తాన్ రావు (నెల్లూరు జిల్లా ), భరత్ (కుప్పం,చిత్తూరు జిల్లా), వరుదు కళ్యాణి (విశాఖపట్నం జిల్లా), యార్లగడ్డ వెంకట రావు (కృష్ణ జిల్లా), హరిప్రసాద్ రెడ్డి (చిత్తూరు జిల్లా), వై లక్ష్మీదేవి (ఉరవకొండ,అనంతపురం జిల్లా), ఆమంచి కృష్ణమోహన్ (చీరాల,ప్రకాశం జిల్లా) పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి.వీరిలో మర్రి రాజశేఖర్‌కు మంత్రి పదవి ఇస్తామని గతంలోనే సీఎం జగన్ హామీ ఇచ్చారు. దీంతో ఆయన్ను కేబినెట్లోకి తీసుకునేందుకు ఎంపిక చేస్తారన్న ప్రచారం జరుగుతోంది. అలాగే పార్టీ సీనియర్ నేత, వైఎస్ కుటుంబానికి సన్నిహితుడు దుట్టా రామచంద్రరావు కూడా ఎమ్మెల్సీ పదవి కోసం యత్నిస్తున్నారు. తన కుమార్తెకు కృష్ణాజెడ్పీ చైర్ పర్సన్ పదవిని ఆశించిన ఆయన.. అది కుదరకపోవడంతో ఎమ్మెల్సీ అయినా ఇవ్వాలని




జగన్ ను కోరుతున్నట్లు సమాచారం.బద్వేలు ఉపఎన్నిక అనంతరం ఎమ్మెల్సీ పదవుల భర్తీకి ముహూర్తం పెట్టే అవకాశాలున్నాయి. ఆ తర్వాతే కేబినెట్లో మార్పులు చేయనున్నారు. దసరాకే చేపట్టాలని సీఎం జగన్ భావించినా.. బద్వేలు ఉపఎన్నిక, ఎమ్మెల్సీ స్థానాలు భర్తీకావలసి ఉండటంతో వాయిదా వేశారు.

# 'హైదరాబాద్‌లో ఉంటూ చంద్రబాబు చౌకబారు రాజకీయాలు'

నెల్లూరు: పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు 78 లక్షల మందికి 6, 440 కోట్లు రెండో విడత వైఎస్సార్ ఆసరా ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించారని మంత్రి అనిల్ కుమార్ యాదవ్ స్పష్టం చేశారు. రెండు విడతల్లో కలిపి 12,700 కోట్లు నేరుగా లబ్ధిదారుల అకౌంట్‌లోకి వేశారని అనిల్ కుమార్ తెలిపారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతూ.. మహిళలను అప్పుల ఊబిలోనుంచి బయటకు తీసుకు రావాలన్నదే సీఎం వైఎస్ జగన్ ఆలోచన. మహిళా సాధికారత కోసం పథకాలు తీసుకొచ్చారు' అని తెలిపారు. 'సున్నా వడ్డీ ని కూడా చంద్రబాబు నిర్వీర్యం చేశారు. ఆ అప్పు 3000 వేల కోట్ల భారాన్ని కూడా ప్రభుత్వం భరిస్తోంది. టీడీపీ హయాం లో మహిళలకు ఒక్క ఇల్లుకూడా ఉచితంగా ఇవ్వలేదు. టిడ్కో ఇళ్ల పేరుతో ఋణభారం మోపాలని చూశారు. సీఎం వైఎస్ జగన్ టిడ్కో ఇళ్లను కూడా ఉచితంగా అందిస్తున్నారు. 4 వేల కోట్ల భారాన్ని ప్రభుత్వమే భరిస్తోంది. హైదరాబాద్ లో ఉంటూ అప్పుడుడప్పుడూ వచ్చి చంద్రబాబు చౌకబారు రాజకీయాలు చేస్తున్నారు' అని విమర్శించారు.




## కాంట్రాక్టర్లపై కక్ష సాధింపులేంటి?: చంద్రబాబు



అమరావతి: గుత్తేదారులకు బిల్లులు చెల్లించాలని న్యాయస్థానాలు ఎన్నిసార్లు ఆదేశించినా ప్రభుత్వం లెక్కలేనితనంగా వ్యవహరిస్తోందని తెదేపా అధినేత చంద్రబాబు ధ్వజమెత్తారు. కోర్టులు ఆదేశించినా ఉపాధిహామీ బిల్లులు ఎందుకు ఇవ్వడం లేదని నిలదీశారు. గ్రామాలను అభివృద్ధి చేసిన గుత్తేదారులపై కక్ష సాధింపులేంటని ప్రశ్నించారు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకుండా వేధించడం దుర్మార్గమని మండిపడ్డారు. జగన్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి పారిశ్రామిక వేత్తలు, అభివృద్ధి పనులు చేపట్టడానికి గుత్తేదారులు ముందుకు రావడంలేదని దుయ్యబట్టారు.ఏలూరులో రంజిత్ అనే కాంట్రాక్టర్‌కు బిల్లులు ఇవ్వకుండా వేధించడంతో ఆత్మహత్యాయత్నం చేశారని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. రంజిత్‌కు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. గ్రామాల అభివృద్ధికి కృషిచేసిన వారిలో ఎక్కువ మంది ఎస్సీ, ఎస్టీ, బీసీలే ఉన్నారని.. వారిని ఆర్థికంగా అణగదొక్కేందుకు ప్రభుత్వం ప్రయత్నించడం హేయనీయమని విమర్శించారు. చేసిన పనులకు ప్రభుత్వం బిల్లులను చెల్లించకపోవడంతో టెండర్లు వేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదన్నారు. సుమారు రూ.80వేల కోట్ల మేర కాంట్రాక్టర్లకు ప్రభుత్వం బకాయిలు పెట్టిందని దుయ్యబట్టారు. గుత్తేదారులెవరూ ఆందోళన చెంది ఆత్మహత్యలకు పాల్పడవద్దని.. వారికి ప్రతిపైసా అందే వరకు బాధితుల తరపున తెదేపా పోరాటం చేస్తుందని హామీ ఇచ్చారు.


# దుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం జగన్



విజయవాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బెజవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. పూర్ణకుంభంతో అర్చకులు.. సీఎంకు స్వాగతం పలికారు. శరన్నవరాత్రి మహోత్సవాల్లో మూలానక్షత్రం సందర్భంగా మంగళవారం విజయవాడ కనకదుర్గమ్మకు రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలను, పసుపు, కుంకుమలను సీఎం సమర్పించారు. పట్టు వస్త్రాల సమర్పణ అనంతరం అంతరాలయంలో సీఎం ప్రత్యేక పూజలు చేశారు. ముఖ్యమంత్రికి వేద పండితులు ఆశీర్వచనాలు అందజేశారు. అమ్మవారి ప్రసాదం, చిత్రపటాన్ని దేవాదాయశాఖ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం అర్చకులు సీఎంకు పరివట్టం కట్టి తలపాగా చుట్టారు. పట్టు వస్త్రాలను సీఎం తలపై పెట్టగా వేదమంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల మధ్య వైఎస్ జగన్.. దుర్గమ్మ సన్నిధికి చేరుకున్నారు. సరస్వతీ దేవి అలంకారంలో దుర్గమ్మ దర్శనమిస్తున్నారు. సీఎం జగన్ తో పాటు దుర్గమ్మను దర్శించుకున్న వారిలో టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వెల్లంపల్లి శ్రీనివాస్, కొడాలి నాని, పేర్ని నాని, కురసాల కన్నబాబు, ఎమ్మెల్యేలు ఉన్నారు.ఎమ్మెల్యే జోగి రమేష్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కనకదుర్గమ్మకు సీఎం వైఎస్ జగన్ పట్టువస్త్రాలు సమర్పించారని తెలిపారు. దేవీ నవరాత్రుల సందర్భంగా కోటి మంది అక్కచెల్లెమ్మలకు రూ.6782 కోట్లు ఆసరా అందించారని తెలిపారు. ఎంతమంది విఘ్నాలు తలపెట్టినా.. రాక్షసుల రూపంలో అడ్డు తగిలినా కనకదుర్గమ్మ, వెంకటేశ్వరస్వామి ఆశీస్సులు సీఎం జగన్‌పై ఉంటాయని ఎమ్మెల్యే జోగి రమేష్ అన్నారు.

## ఏపీ ఎడ్ సెట్ ఫలితాలు విడుదల

విశాఖపట్నం: ఏపీ ఎడ్‌సెట్ ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయ విశాఖపట్నం లో ఏపీ ఎడ్ సెట్ ఫలితాలను కన్వీనర్ విశ్వేశ్వర్ రావు విడుదల చేశారు. ఈ ఏడాది ఎడ్ సెట్‌కు 15,638 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 13,619 మంది పరీక్షకు హాజరయ్యారు.ఎడ్‌సెట్ ఫలితాల్లో 13,428 మంది అంటే.. 98.60 శాతం మంది అభ్యర్థులు అర్హత సాధించినట్టుట్లు కన్వీనర్ విశ్వేశ్వర్‌రావు వెల్లడించారు. గతేడాది డాటా ప్రకారం 42 వేల సీట్లు అందుబాటులో ఉన్నాయి. కౌన్సెలింగ్ తేదీలను త్వరలోనే ప్రకటించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి పేర్కొంది.




# డిగ్రీ కాలేజీల్లో ఆన్‌లైన్ ద్వారా సీట్ల భర్తీపై ఏపీ హైకోర్టు స్టే

అమరావతి: డిగ్రీ కాలేజీల్లో ఆన్‌లైన్ ద్వారా సీట్ల భర్తీపై ఏపీ హైకోర్టు స్టే విధించింది. ఈ నెల 20 వరకు స్టే విధిస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది. మంగళవారం జీవో నెంబర్ 55పై హైకోర్టులో విచారణ జరిగింది. యాజమాన్య కోటా కింద 30 శాతం సీట్లు కేటాయించి.. వాటిని కూడా కన్వీనర్ నింపడంపై అభ్యంతరం తెలుపుతూ.. యాజమాన్య కోటా కోరని కాలేజీలకు వెసులుబాటు ఇవ్వకపోవడంపై రాయలసీమ డిగ్రీ కాలేజీల అసోసియేషన్ హైకోర్టును ఆశ్రయించింది.అసోసియేషన్ పిటిషన్‌ను హైకోర్టు లంచ్ మోషన్‌గా స్వీకరించింది. జస్టిస్ సత్యనారాయణ మూర్తి ఎదుట విచారణ జరిగింది. పిటిషనర్ల తరపున న్యాయవాది ముతుకుమిల్లి విజయ్ వాదనలు వినిపించారు. వాదోపవాదనలు విన్న ధర్మాసనం ఈ నెల 20 వరకు సీట్ల కేటాయింపు తాత్కాలికంగా నిలిపివేస్తూ.. కేసు తదుపరి విచారణ ఈ నెల 21కి వాయిదా వేసింది.

# సంపాదకీయం

బుధవారం 13 అక్టోబరు 2021

## మళ్లీ రగుతున్న కాశ్మీర్

కాశ్మీర్ లో మరోసారి ఉగ్రవాదం పడగవిప్పింది. ఒక స్కూల్ ప్రిన్సిపాల్, ఒక టీచర్, ఒక కాశ్మీర్ పండిట్ ఫార్మాసిస్టు, ఒక బీహారీ కూలీ, ఇద్దరు కాశ్మీర్ ముస్లీంలు గతవారం లో టెర్రరిస్టు తూటాలకు బలయ్యారు. ప్రతి ఘటన విషాదకరం..ప్రతిదాని వెనుక ఒక భారీ పన్నాగం వుంటుంది. వేర్పాటువాదం, మత సామరస్యానికి భంగం కలిగించడం, ప్రతీకారం పెచ్చరిల్లితే మరింత రక్తపాతం సృష్టించడం, సంక్షోభాన్ని మరింత జటిలం చేయడం.. ఇదంతా దాయాది దేశం పాకిస్థాన్ నుంచి అమలవుతుందనేది స్పష్టం. దశాబ్దాల తరబడి తగలబడుతున్న కాశ్మీర్ రావణ కాష్టం వేనుక ఎవరున్నారన్నది ప్రపంచానికి తెలిసిందే. ఒక్క వారంలోనే ఇన్ని హత్యలు జరగడంతో స్థానికులు, ముఖ్యంగా మైనారిటీలు భయాందోళనలో పడిపోయారు. పలు కాశ్మీర్ పండిట్ కుటుంబాలు వేరే ప్రాంతాలకు తరలి వెళ్లాయి. ఆర్టికల్ 370 రద్దయిన తరువాత కాశ్మీర్ లోయలో పరిస్థితులు చక్కబడ్డాయని కేంద్రం భావిస్తున్న తరుణంలో ఈ ఉగ్రవాద చర్యలు చోటుచేసుకోవడం ప్రతిపక్షాలకు మోదీ ప్రభుత్వంపై విరుచుకుపడే అవకాశమిచ్చింది. మాజీ ముఖ్యమంత్రి మహబూబా ముఫ్తీ మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతి భద్రతలు ఎంత పదిలంగా వుందో ఈ హత్యలు ద్వారా తెలుస్తోందని అన్నారు. ప్రభుత్వం తన విధానాలను పునఃసమీక్షించాలని జమ్మూ కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఫరూక్ అబ్దుల్లా డిమాండ్ చేశారు. అంతేకాదు, ప్రధాని నరేంద్ర మోదీ కశ్మీర్ లోయలో పర్యటించి, ప్రజలకు భరోసా కల్పించాలని కోరారు.. అధికార లెక్కల ప్రకారం ఈ యేడాది ఇంతవరకు 28 మంది ఉగ్రవాదుల దాడుల్లో మరణించారు. భద్రతాదళాలు పెద్ద ఎత్తున గాలింపులు చేస్తున్నాయి. మిలిటెంట్లు, రాళ్లు రువ్విన కేసులో వున్నవారిని పోలీసులు విచారిస్తున్నారు. 90 వ దశకంలో కాశ్మీర్ పండిట్లు భారీ సంఖ్యలో వారి వారి ఆస్థులను అమ్ముకుని వలసబాట పట్టారు. ఆ ఆవకాశాన్ని వినియోగించుకున్న వారు ఆస్థులను అతి తక్కువ ధరకు కొనుగోలు చేసుకున్నారు. పండిట్లకు గత్యంతరం లేకుపోవడంతో వచ్చినకాడికి తీసుకోవాల్సివచ్చింది. తాజాగా పండిట్ల ఆస్థులను వారికి కేంద్రం అప్పగిస్తుందని వార్తలు వచ్చాయి. ఈ వారంపాటు జరిగిన ఘటనలకు ఈ ఆస్థుల నేపథ్యం కుడా వుండవచ్చిని నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. తాజాగా మంగళవారం తెల్లవారుజామున జమ్మూ కశ్మీర్లోని షోపియాన్ జిల్లాలో భారీ ఎన్కౌంటర్ జరిగింది. భద్రతా దళాలు, ఉగ్రవాదులకు మధ్య జరిగిన భీకర కాల్పుల్లో లష్కర్ ఈ తోయిబా-ది రెసిస్టెన్స్ ఫ్రంట్కు చెందిన ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. వారి వద్ద నుంచి భారీ స్థాయిలో ఆయుధాలు, మందుగుండు సామాగ్రిని కూడా స్వాధీనం చేసుకున్నారు. సోమవారం నాడు జమ్మూకశ్మీర్లోని పూంచ్ జిల్లా సూరన్కోట్లోని ఓ గ్రామంలో ఉగ్రవాదులు, జవాన్లకు మధ్య జరిగిన ఎన్కౌంటర్లో ఐదుగురు జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. సరిహద్దు చోరబాట్లు తగ్గాయి. లష్కరే తోయిబా మిలిటెంట్లు చాలామంది ఎన్ కౌంటర్లలో మరణించారు. క్రియాశీలకంగా వున్నవారంతా కొత్తగా వచ్చినవారేనని పోలీసులు అంటున్నారు. పాకిస్థాన్ అక్రమిత కాశ్మీర్ లో వుంటున్న తీ?వ్రవాదులు చాలామంది అఫ్ఘనీస్థాన్ లో వున్నారని కుడా వార్తలోచ్చాయి. కాశ్మీర్ ను మూడు భాగాలుగా విడగోట్టడం కుడా తీవ్రవాద కార్యకలాపాల నియంత్రణకు కారణమయింది. కాశ్మీర్ లో కేంద్రం ప్రకటించిన పథకాలు అమలు కావడం, పటిష్ట నిఘా వ్యవస్థ, స్థానిక మతపెద్దల తో తరచూ భేటీలు, ఉపాధి అవకాశాలు కల్పన తో కాశ్మీర్ లో తిరిగి శాంతి నెలకొంటుందని పరిశీలకులు భావిస్తున్నారు.

## ప్రచారానికే పరిమితమైన ఈ నామ్ సెంటర్లు

కర్నూలు, అక్టోబరు 12, (న్యూస్ పల్స్) కర్నూలు జిల్లాలోని మార్కెట్ యార్డుల్లో ప్రయోగశాలల సేవలు కేవలం ప్రచారానికే పరిమితమయ్యాయి. జిల్లాలో ఈ-నామ్ పరిధిలో కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండ యార్డులను చేర్చింది. వీటిలో పత్తికొండ మినహా మిగిలిన మూడు రెగ్యులేటెడ్ మార్కెట్లలో అసైన్ ల్యాబ్ సేవలను తెరపైకి తెచ్చింది. పత్తి, వేరుశనగ, ఆముదాలు, పూలవిత్తనాలు, శనగలు, కందులు, కుసుమలు, వాము తదితర పంట దిగుబడుల విక్రయాలు సాగుతాయి. ఏటా మూడు యార్డుల్లో దాదాపు రూ.3 వేల కోట్లకు పైగా వ్యాపార లావాదేవీలు సాగుతున్నాయి. యార్డులో ఎన్సీఎంఎల్ ద్వారా ల్యాబ్ సేవలను అందిస్తున్నారు. యార్డులకు రైతులు తెచ్చిన పంట ఉత్పత్తులను పరిశీలించి.. వాటి నాణ్యత నిర్ధారించి.. మెరుగైన ధరలు అందించడమే వీటి లక్ష్యం. 2018, ఏప్రిల్ 24న వీటి సేవలను ఆరంభించారు. ఒక్కో కేంద్రంలో 5 నుంచి 10 మందికి సిబ్బందిని కేటాయించారు. సేవలు ఆరంభమై ఇంతవరకు వీటి ఫలితాలు మాత్రం పుడమిపుత్రులకు అందడం లేదు. లక్ష్యాన్ని విస్మరించి.. కేవలం సంఖ్య కోసమే చేయాలనేట్లుగా యార్డుల్లో పని నడిచిపోతోంది. నిజానికి యార్డుకు వచ్చి నమోదు చేసి లాట్ సంఖ్యలు కేటాయించాలి. అక్కడి నుంచి యార్డులో ఉంచాక..లాట్ల ఆధారంగా దిగుబడుల నమూనాలు తీసుకుని.. వాటిని పరిశీలించి.. నూనె, తేమ శాతం ఇలా పలు రకాలుగా పరిశీలించి.. అంతర్జాలంలో పొందుపర్చాలి. అనంతరం దేశవ్యాప్తంగా గుర్తించిన ఈ-నామ్ మార్కెట్లలో గుర్తింపు పొందిన వ్యాపారులు అంతర్జాలంలో నాణ్యతా ప్రమాణాలను పరిశీలించి ఎక్కడి నుంచైనా రైతు సరకుకు టెండరు వేయవచ్చు. అనంతరం అంతర్జాలం ద్వారానే చెల్లింపులు జరిగిపోతాయి. దీనివల్ల సాగుదారుకు పోటీ పెరిగి.. మేలైన ధర అందే అవకాశం ఉంది. యార్డుల్లో ప్రస్తుతం కేవలం నూనె గింజల పంట దిగుబడులను పరీక్షలు చేస్తున్నారు. ఆదోనిలో వేరుశనగ, ఎమ్మిగనూరులో వేరుశనగ, శనగలు, ఆముదాలు, కర్నూలు యార్డులో వేరుశనగ, కందులు, శనగలు, ఆముదాలకు మాత్రమే ల్యాబ్ల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఆదోని, ఎమ్మిగనూరు యార్డుల్లో తేమ, ఔటన్ తదితర శాతాలు మాత్రమే పరీక్షలు నిర్వహిస్తున్నారు. కర్నూలు యార్డులో ఎన్ఐఆర్ యంత్రం మాత్రమే ఉంది. ఈ యంత్రం ఉంటే.. సరకుకు మరింత నాణ్యత నిర్ధారించి.. మెరుగైన ధరలు అందించే అవకాశాలు ఉన్నాయి. యంత్ర పరికరాల కొరత వల్ల..రైతులకు నష్టం వాటిల్లుతోంది. వచ్చే సీజన్ నాటికైనా వీటిపై దృష్టిసారిస్తే ఎంతో మేలు కలిగే వీలుంది. ఇక మిగిలిన పంట దిగుబడుల పరిస్థితిపై ఇంతవరకు అధికారులు ఎలాంటి నిర్ణయాలు చేయకపోవడం గమనార్హం. పాత పద్ధతుల్లోనే వ్యాపారాలు సాగుతున్నాయి. టెండర్కు ఉంచిన సరకుకు వ్యాపారి వేసే ధరే రైతులు అందుకుంటున్నారు. వ్యాపారి ఎంత ధర వేస్తే.. అంతకే కర్షకులు అమ్మేసి ఇంటిబాట పడుతున్నారు. నిజానికి ఏదైనా లాట్కు తక్కువ ధర అందితే.. రైతు అసైన్ ల్యాబ్కు వచ్చి.. తన పంటను పరిశీలన చేసుకుని.. నిర్ధారించుకోవచ్చు. సేవలు పూర్తిగా ఉచితం. అందుకు తగ్గట్లు ధర అందకపోతే.. యార్డు అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు. ప్రచార లేమి.. రైతుల నిరక్షరాస్యత.. అమాయకత్వం వల్ల.. వీటి సేవలు మరుగున పడుతున్నాయి. ఈ-నామ్ నిర్వహణ భేషుగ్గా ఉన్నా... ఇంకా పూర్తిగా రూపాంతరం చెందించడంలో అధికారులు సఫలీకృతం కావడం లేదు. రోజూ ఒక్కో మనిషి 30 లాట్లకు మించి పరీక్షలు చేయలేరు. ఇక ఒక్కో లాట్ను పరిశీలించాలంటే.. కనీసం 10-15 నిమిషాలు పడుతుంది. ప్రస్తుతం అన్సీజన్ కావడంతో పదుల సంఖ్యలో లాట్లలో దిగుబడులు వస్తున్నాయి. అదే సీజన్ సమయమైతే వందల సంఖ్యలో వస్తాయి. ప్రస్తుతం ఉన్న సిబ్బంది సంఖ్యతో వీటికి నాణ్యత పరీక్షలు చేయాలంటే సాధ్యం కాని పని.

## ముగ్గురు మావోయిస్టుల మృతి

విశాఖపట్నం అక్టోబరు 12, (న్యూస్ పల్స్) విశాఖ ఏజెన్సీ లో జరిగిన ఎదురు కాల్పుల్లో ముగ్గరు మావోయిస్టుల మృతి చెందారు. ఆంధ్రా ఒడిశా బార్డర్ ప్రాంతంలో మావోయిస్టులకు పోలీసులకు ఎదురు కాల్పులు జరిగాయి. మావోయిస్టులు మందుపాతర పేల్చారు. దాంతో పోలీసులకు గాయాలు అయ్యాయి. మల్కన్ గిరిజిల్లా తులసిపహాడ్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులకు పోలీసులకు ఎదురు కాల్పులు జరిగాయి. ఎదురు కాల్పుల్లో ముగ్గరు మావోయిస్ట్ మృతిచెందినట్లుఒరిస్సా డిజిపి ప్రకటించారు. మృతి చెందిన మావోయిస్టు ఏవోబీఎస్జెడ్ సీ మల్కన్ గిరి - కోరాపుట్- విశాఖ బోర్డర్ డివిజన్ సభ్యురాలుగా ప్రాధమికంగా నిర్ధారించారు. ఎస్ ఓ జీ జవాన్కుగాయాలుకావడంతో హెలికాప్టర్ లో తరలించ డానికి ఏర్పాట్లు చేసారు.

## అక్రమ మద్యం పట్టివేత

కాకినాడ అక్టోబరు 12, (న్యూస్ పల్స్) తుర్పు గోదావరి జిల్లా పెదపూడి మండలం, చింతపల్లి లాకుల వద్ద యానాం నుండి గొల్లల మామిడాడకు అక్రమ మద్యాన్ని తీసుకువెళ్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశామని ఎస్సై వినోద్ తెలిపారు. పెదపూడి పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్సై వినోద్ మాట్లాడుతూ కాకినాడ రూరల్ సీఐ ఆకుల మురళీ కృష్ణ పర్యవేక్షణలో చింతపల్లి లాకుల వద్ద తమ సిబ్బందితో తనిఖీలు చేపట్టామన్నారు.. ఈ నేపథ్యంలో మామిడాడ కు చెందిన మేడపాటి సాయి శేఖర్ రెడ్డి మరియు అతని తండ్రి వెంకట రెడ్డి రెండు ప్లాస్టిక్ పెద్ద సంచుల్లో 180ఎంఎల్ గల 100 బాటిల్ల అక్రమ మద్యాన్ని యానాం నుండి గొల్లల మమిడాడకు తీసుకువెలుతున్న వారిద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించామని ఎస్సై వినోద్ వెల్లడించారు...

## కోర్టు ఆదేశాలు ధిక్కారానికి పాల్పడుతున్న ఎస్సై పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలి




### లాయర్ సురేష్ కుమార్ డిమాండ్

నెల్లూరు అక్టోబరు 12, (న్యూస్ పల్స్) కోర్టు ఆదేశాలు దిక్కరించి తన సొంత నిర్ణయాలతో విధులు సాగిస్తున్న ఇందుకూరుపేట మండల పోలీస్ స్టేషన్ ఎస్ఐ పై విచారణ జరిపించి చట్ట రీత్యా తగిన చర్యలు తీసుకోవాలని లాయర్ సురేష్ కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు జిల్లా, ఇందుకూరుపేట మండలం, కొరుటూరు పాలెం గ్రామంలో లో లో సెప్టెంబర్ నెల 10 న జరిగిన వినాయక చవితి ఊరేగింపు అనంతరం సుమారు 12 గంటల సమయంలో ఒకే కుటుంబానికి చెందిన రెండు దాయాదుల వర్గాలకు చెందిన బంధువులు ఘర్షణ పడ్డారని తెలిపారు. ఈ విషయమై ఇరువర్గాలు ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకోవడం జరిగింది అన్నారు. అయితే ఒక వర్గానికి చెందిన 15మంది నిరుపేద మత్స్యకారులపై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. సదరు 15 మంది మత్స్యకారులు ముందస్తు బెయిల్ కోసం జిల్లా కోర్టును ఆశ్రయించగా స్పెషల్ జడ్జి ఫర్ ట్రైలర్ అఫెన్సస్ అండర్ ఎస్సీ అండ్ ఎస్ టి యాప్ కం 5వ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి ఈ నెల 8 న క్రైమ్ నెంబర్ 824/2021 ఆర్డర్ నందు ఇందుకూరుపేట పోలీస్ స్టేషన్ లో రిజిస్టర్ అయిన158/2021న ముద్దాయి అయిన 15 మందికి41( ఎ) సి ఆర్ పి సి ప్రకారం వారి ఓకే సమక్షమున నోటీసులు జారీ చేయమని సదరు పోలీసులను సూచించడం జరిగిందని తెలియజేశారు. సదర్ అదుర్స్ కాఫీతో మత్స్యకారుల ముద్దాయిల తరపున వకీలు నేను స్టేషన్ కు వెళ్లగా అక్కడ అ ఎస్ఐ శ్రీనివాసులు స్టేషన్లో లేరని కానిస్టేబుల్స్ చెప్పడం జరిగిందన్నారు. ఈ విషయమై ఎస్సై తో ఫోన్లో సంభాషించగా నోటీసులు ఇచ్చే ప్రసక్తే లేదని తాను ముద్దాయి అయిన 15 మంది మత్స్యకారులను అరెస్టు చేయడం తప్పదన్నారని చెప్పడం జరిగిందన్నారు. ఈ విధంగా కోర్టు ఆదేశాలను ధిక్కరిస్తే తమను భయాందోళనకు గురి చేస్తున్నాడని, తమకు పాత నేరచరిత్ర అంత కట్టేందుకు ప్రయత్నిస్తున్నాడని ముద్దాయిల తరపున ఆరోపించారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి రోజువారి కూలీలైన మత్స్యకారుల తరపున ఇచ్చిన కోర్టు ఆదేశాలు అధికారులకు పాల్పడుతున్న ఎస్ఐ శ్రీనివాసులు పై విచారణ జరిపించి, చట్ట రీత్యా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ సమావేశంలో బాధిత ముద్దాయిలు మరియు గ్రామ స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## సెలవుల్లో కాలేజీ రన్ చేస్తున్న రాజమహేంద్రవరం డిగ్రీ కాలేజీ వద్ద ఏ.బీ.వీ.పీ నిరసన

రాజమహేంద్రవరం అక్టోబరు 12, (న్యూస్ పల్స్) రాష్ట్ర ప్రభుత్వం దసరా సెలవులు ప్రకటించగా వాటికి విరుద్ధంగా రాజమహేంద్రి డిగ్రీ కళాశాల యాజమాన్యం క్లాసులు నిర్వహించడంపై ఏబీవీపీ నగర శాఖ నిరసన వ్యక్తం చేసింది. ఈనెల 11వ తేదీ నుంచి 20వ తేదీ వరకు పాఠశాలలకు కళాశాలలకు ప్రభుత్వం దసరా సెలవులు ప్రకటించడంతో తెలిసిందే నిబంధనలకు విరుద్ధంగా నగరంలో కొన్ని ప్రైవేటు కళాశాలలు క్లాసులు నిర్వహించడంపై ఏబీవీపీ నగర శాఖ అడ్డుకోవడం జరిగింది ఈ క్రమంలో మంగళవారం రాజమహేంద్రి డిగ్రీ కళాశాలలో క్లాసులు నిర్వహిస్తున్న యాజమాన్యానికి వ్యతిరేకంగా ఏబీవీపీ విద్యార్థులు నిరసన చేశారు ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు సాయి కుమార్, మోహన్ తదితరులు మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం సెలవు ప్రయత్నించినప్పటికీ రాజమహేంద్రి నిబంధనలకు విరుద్ధంగా క్లాసు నిర్వహిస్తుందని విమర్శించారు క్లాసులు వద్దని యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లగా డైరెక్టర్ టీకే విశ్వేశ్వరరెడ్డి ప్రభుత్వానికి వ్యతిరేకంగా దూషించారని ఆందోళన చేస్తున్న తమ పైన దురుసుగా వ్యవహరించారని ఆరోపించారు

## కన్వెన్షన్ సెంటర్ కు భూమి పూజ

విశాఖపట్నం అక్టోబరు 12, (న్యూస్ పల్స్) వెయ్యి మంది కెపాసిటీ తో కన్వెన్షన్ సెంటర్ నిర్మించటం జరుగుతుంది. 2 కోట్లలో సగం ఎంపీ నిధులు మిగతా నిధులు జివిఎంసి నిధులతో నిర్మిస్తున్నామని జీవీ ఎం వి కమిషనర్ సృజన అన్నారు. సుమారు ఒక సంవత్సరంలో దీనిని అందుబాటులోకి తీసుకువస్తాం. ప్రతి ఒక్క జోన్ లో ఒక కన్వెన్షన్ సెంటర్ నిర్మించటానికి ప్రణాళికలు చేపడుతున్నామని అన్నారు. ఎంపీ విజయ సాయి రెడ్డి మాట్లాడుతూ 8 జోన్ లో 8 సైట్లు గుర్తించి 50 శాతం ఎంపీ నిధులు మిగతా 50 శాతం జివిం వి సి నిధులు తో కన్వెన్షన్ సెంటర్ నిర్మిస్తున్నాం. దాతలు ఇంకా ముందుకు వస్తే మరిన్ని అభివృద్ధి కట్టడాలు చేపడతాం. విశాఖ ను మరింత అభివృద్ధి చేయటానికి సీఎం మరిన్ని ప్రణాళికలు చేస్తున్నారని అన్నారు.

## హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా ఫ్లెక్సీలు

### వైయస్సార్ ఫ్లెక్సీ వెంటనే తొలగించాలి
### పట్టించుకోని అధికార యంత్రాంగం

కాకినాడ అక్టోబరు 12, (న్యూస్ పల్స్) తూర్పు గోదావరి జిల్లా మండపేట పట్టణంలో గతంలో ఫ్లెక్సీల వివాదం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది అటువంటి సంఘటనే పట్టణంలో మరలా పునరావృతం అవుతుంది. మండపేట పట్టణ ముఖద్వారం ప్రధాన రహదారి నిత్యం వేల వాహనాలు, లక్షల ప్రజలు వెళ్లే మార్గం అది, మండపేట పెద్ద కాలువ వంతెన సమీపాన ఉన్న కనక దుర్గ విగ్రహం పూర్వం నుండి అక్కడే ఉంది, నిత్యం రాజమండ్రి కాకినాడ మధ్య ఉండే ఊర్లు అటుగా వెళ్లే ప్రయాణికులు భక్తులు అమ్మవారి దర్శనము ఆశీస్సులు తీసుకుని వెళుతూ ఉంటారు. అలాంటి ప్రధాన రహదారిలో అమ్మవారిని అవమానపరిచే విధంగా ఫ్లెక్స్ లు కట్టడం దుర్గమ్మ భక్తులను, హిందువులను కించపరిచే విధంగా ఉన్నాయని కొంతమంది భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వారం రోజుల క్రితం టీటీడీ చైర్మన్ వై వి సుబ్బారెడ్డి మండపేట పట్టణము వస్తున్నారని మండపేట పట్టణ లో అన్ని ముఖ్యమైన సెంటర్ లోనూ మెయిన్ రోడ్ లోనూ విచ్చలవిడిగా వైయస్సార్ పార్టీ నాయకులు అభిమానులు కార్యకర్తలు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి వారం రోజులు గడిచినా అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం, దసరా సందర్భంగా విజయదశమి రోజుల్లో పట్టణ ప్రజలు భవానీ భక్తులు, అటుగా వెళ్లే వారు ఎంతో మంది అమ్మవారి విగ్రహాన్ని పూజిస్తూ ఉంటారు. అలా నిత్యం పూజలు అందుకుంటున్న అమ్మవారి విగ్రహం తలపై కాళ్లతో తొక్కి నట్లు ఫ్లెక్సీని ఏర్పాటు చేయడం దుర్గ భక్తులను ఆవేదనకు గురిచేస్తుంది. వెంటనే ఇలాంటి ఫ్లెక్సీలను తొలగించాలని లేకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటున్నారు అని మండపేట పట్టణ ప్రజలు కోరుతున్నారు. ఈ మధ్యకాలంలో విజయవాడలో దుర్గ కొండ పై జరిగిన సంఘటన మరువక ముందే ఇటువంటి సంఘటనలు చోటుచేసుకోవడం హిందూ మతం పై అవమానించే విధంగా సంఘటనలు జరగడం వలన తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుంది అని హిందూ మత పెద్దలు హెచ్చరించారు. అధికారులు వై వి సుబ్బారెడ్డి కార్యక్రమం జరిగే వారం రోజులు గడిచినా ఈ ఫ్లెక్సీలపై ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం హిందువులు, దుర్గ భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## శ్రీశైలం జలాశయం 4 గేట్లు పది అడుగుల మేర ఎత్తివేత

శ్రీశైలం అక్టోబరు 12, (న్యూస్ పల్స్) శ్రీశైలం జలాశయానికి వరద ఉధృతి పెరిగింది ఎగువ పరీవాహక ప్రాంతాలైన జూరాల, సుంకేసుల, హంద్రి నుంచి శ్రీశైలం జలాశయానికి భారీగా వరదనీరు వచ్చి చేరుతుంది జలాశయంలోని 12 రేడియల్ క్రస్ట్ గేట్లలో 4 గేట్లు 10 అడుగుల మేర ఎత్తి దిగువ నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు వరదనీటిని డ్యామ్ అధికారులు విడుదల చేస్తున్నారు లాశయానికి వరదనీరు భారీగా వచ్చి చేరడంతో శ్రీశైలం జలాశయంలో గంటగంటకు నీటిమట్టం పెరుగుతుంది జూరాల ప్రాజెక్టు నుంచి శ్రీశైలం ప్రాజెక్టుకు ఒక లక్షా 4 వేల 240 క్యూసెక్కులు వరదనీరు వచ్చి చేరుతుండగా సుంకేశుల నుంచి 67 వేల 20 క్యూసెక్కులు వరదనీరు వచ్చి చేరుతుంది అలగే హంద్రి నుంచి 117 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది శ్రీశైలంజలాశయం పూర్తి స్ధాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం 884.80 అడుగులుగా ఉంది పూర్తి స్ధాయి నిటి నిల్వ సామర్థ్యం 215.8070 టీఎంసీలు కాగా ప్రస్తుతం 214.8450 టీఎంసీలకు చేరుకుంది ఇన్ ఫ్లో ఒక లక్షా 71 వేల 377 క్యూసెక్కులు అవుట్ ఫ్లో ఒక లక్ష 76 వేల 034 క్యూసెక్కులుగా ఉంది శ్రీశైలం కుడిగట్టు, ఎడమగట్టు జలవిద్యుత్ కేంద్రాలలో పూర్తి స్ధాయిలో విద్యుత్ ఉత్పత్తి చేస్తూ దిగువ నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు వరదనీటిని నీటిని విడుదల చేస్తున్నారు

## చిన్నమ్మ సైలెంట్ అయిపోయారే



విజయవాడ, అక్టోబరు 12, (న్యూస్ పల్స్) భారతీయ జనతా పార్టీలో కీలక నేతగా ఉన్న పురంద్రీశ్వరి గత కొంత కాలంగా మౌనంగా ఉంటున్నారు. దాదాపు ఆమె పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు దాదాపు ఆమె పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నట్లు లెక్కే. కన్నా లక్ష్మీనారాయణ బీజేపీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు యాక్టివ్ గా ఉన్న పురంద్రీశ్వరి సోము వీర్రాజు పార్టీ బాధ్యతలు స్వీకరించాక కొంత స్లో అయ్యారు. దీనికి కారణాలు బయటపడకపోయినా పురంద్రీశ్వరి పార్టీ పట్ల కొంత అసంతృప్తితో ఉన్నట్లే తెలుస్తోంది. పురంద్రీశ్వరి ఎన్టీఆర్ కుమార్తెగా రెండు రాష్ట్రాల ప్రజలకు సుపరిచితమే. అయితే తొలుత కాంగ్రెస్ లో చేరిన పురంద్రీశ్వరికి కేంద్ర మంత్రి పదవి దక్కింది. కాంగ్రెస్ లో ఆమెకు తగిన గౌరవం లభించింది. అయితే రాష్ట్ర విభజన తర్వాత పురంద్రీశ్వరి బీజేపీలో చేరారు. బీజేపీలో పార్టీ పరంగా పదవులు ఇచ్చినప్పటికీ తనను కేంద్రంలోని పెద్దలు గుర్తించడం లేదన్న అభిప్రాయంలో పురంద్రీశ్వరి ఉన్నారు. రెండోసారి అధికారంలోకి బీజేపీ వచ్చిన తర్వాత పురంద్రీశ్వరి పదవిపై ఆశలు పెట్టుకున్నారు. తన భర్త వైసీపీలో చేరి గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసినా ఆమె మాత్రం బీజేపీ వెంటే నడిచారు. రెండోసారి బీజేపీ కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేశాక తనకు కేంద్ర మంత్రి పదవి వస్తుందని ఆశించారు. ఏపీ నుంచి తనకే ప్రాధాన్యత లభిస్తుందని భావించారు. కనీసం రాజ్యసభకు కూడా ఎంపిక చేయకపోవడంతో పురంద్రీశ్వరి గుర్రుగా ఉన్నారు. అందుకే గత కొంతకాలంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. దీనికి మరొక కారణం ఉందంటున్నారు.

## సింహాచలంలో ఆర్జిత సేవలు

విశాఖపట్నం అక్టోబరు 12, (న్యూస్ పల్స్) విశాఖ శ్రీ వరాహ లక్ష్మి నృసింహ స్వా మి వారి దేవాలయములో శాస్త్రోక్తంగా పలు ఆర్జిత సేవలు వైభవంగా నిర్వహించారు. అర్చకులు వేకువ జామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రాతఃకాల పూజలు సాంప్రదాయ బద్దంగా నిర్వహించారు. శ్రీ దేవి, భూదేవి సమేత గోవింద రాజు స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపములో వేదికపైఅధీష్టింపజెసివేద మంత్రాలు నాథ స్వర మంగళ వాయిద్యాల నడుమ శ్రీ స్వామి వారి సహస్ర నామార్చన, నిత్య కళ్యాణం కమనీయంగా జరిపించిన అనంతరం వెండి గరుడ వాహనము పై స్వామి వార్ని ఆదీష్టింపజేసి వైభవంగా శ్రీ స్వామి వారి గరుడ వాహన సేవను నిర్వహించారు.

# సంచలనం సృష్టించిన ఉండవల్లి

రాజమండ్రి, అక్టోబరు 12, (న్యూస్ పల్స్) ఉండవల్లి అరుణ్ కుమార్ సంచలనం సృష్టించారు. వైసీపీ సర్కారు పదవీ కాలంలో దాదాపు సగం పూర్తయిన తర్వాత ఆయన ఒక్కసారిగా విరుచుకు పడ్డారు. ఏది చెప్పినా అంకెల సాక్ష్యాధారాలతో , రాజకీయ గణాంకాలతో , హేతుబద్ధమైన తర్కంతో మాట్లాడే ఉండవల్లి కి రెండు తెలుగురాష్ట్రాల్లో విస్తృతస్థాయిలో అభిమానులున్నారు. ఆయన చెప్పిన మాటలను విశ్వసించేవారి సంఖ్య రాజకీయవర్గాల్లో అధికంగా ఉంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దివాళా అంచున ఉందని, ఇప్పటికే పేరుకుపోయిన ఆరులక్షల కోట్ల రూపాయల అప్పును వడ్డీతో సహా చెల్లించడం తలకుమించిన భారమని తేల్చేశారాయన. భవిష్యత్తులో ఏడాదికి 40 వేల కోట్ల రూపాయల వడ్డీ రూపంలో చెల్లించాల్సి వస్తుంది. జీతాలు ఇవ్వడం కూడా కష్టమేనంటూ సాధికారికంగా ప్రకటించారు. దీంతో వైసీపీ సర్కారు తలలు పట్టుకుంటోంది. ఉండవల్లి అరుణ్ కుమార్ అంకెల సహా వెల్లడించిన వివరాలను ఖండించడమెలాగో తెలియక ప్రభుత్వంలోని పెద్దలు మల్లగుల్లాలు పడుతున్నారు.తెలుగుదేశం పార్టీ చంద్రబాబు నాయుడు, జనసేన పవన్ కల్యాణ్, ఈనాడు, ఆంధ్రజ్యోతి మీడియా సంస్థలు సర్కారీ అప్పుల గురించి నిత్యం ఘోష పెడుతున్నాయి. కానీ రాజకీయ కారణాల రీత్యా వారు చేస్తున్న ప్రచారానికి ప్రజల్లో అంత విశ్వసనీయత లభించడం లేదు. వైసీపీ వర్గాలు రాజకీయంగా దాడి చేస్తూ ప్రతిపక్షాలు మీడియా చేస్తున్న ప్రచారాన్ని గాలి చేస్తున్నారు. కానీ ఉండవల్లి అరుణ్ కుమార్ కి ప్రజల్లోనూ, రాజకీయ వర్గాల్లోనూ, మీడియాలోనూ ఉన్న క్రెడిట్ వేరు. రాజకీయంగా తటస్థంగా ఉండటం ఆయనకు అడ్వాంటేజ్, అందులోనూ వైఎస్ రాజశేఖరరెడ్డికి నమ్మకమైన సహచరునిగా ముద్ర ఉండనే ఉంది. మరోవైపు పోరాటంలో వెనుదిరగరని పేరుంది. రామోజీ రావు వంటి మీడియా టైకూన్ కే సవాల్ విసిరి ముప్పుతిప్పలు పెట్టి



మూడు చెరువుల నీరు తాగించిన ఘనత ఆయన సొంతం. ఓపెన్ మీడియాగా, ఓపీనియన్ మేకర్ గా ఉండవల్లి ప్రభావం చాలా ఎక్కువ. చాలాకాలంగా ప్రతిపక్షాలు, మీడియా చేస్తున్న ప్రచారం వాస్తవమేనని వెల్లడిస్తూ మరిన్ని వివరాలతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని నగ్నంగా నడిరోడ్డుపై ఆయన నిలబెట్టేశారు.ఉండవల్లి అరుణ్ కుమార్ కి దీటుగా సమాధానం చెప్పలేకపోతే వైసీపీ సర్కారు పరువు పోతుంది. చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ వంటి నాయకులకు సమాధానం ఇచ్చినట్లుగా మసిపూసి మారేడు కాయ చేసేలా ప్రభుత్వం ప్రతివిమర్శలకు దిగితే మరో ప్రమాదం. వాటన్నిటిపై మళ్లీ ఉండవల్లి మీడియా సమావేశం పెడతారు. మరింతగా రచ్చ సాగుతుంది. ప్రభుత్వ ప్రతిష్ఠ ఇంకా దెబ్బతింటుంది. అందువల్ల ఈ రాజకీయ మేధావిని ఎదుర్కోవడమెలాగో తెలియక వైసీపీ ముఖ్య నాయకులు తలలు పట్టుకుంటున్నారు. ఉండవల్లి అరుణ్ కుమార్ పాత్రికేయ సమావేశం నిర్వహిస్తున్న సందర్భంలో ఆన్ లైన్ లోనూ, ఎలక్ట్రానిక్ మీడియాలోనూ వీక్షించిన వారి సంఖ్య ఎంటర్టైన్ మెంట్ చానళ్లతో పోటీ పడిందనే మరో పిడుగులాంటి సమాచారమూ ప్రభుత్వానికి చేరింది. అందుకే సర్కారులో వణుకు మొదలైంది.సాధారణంగా ప్రభుత్వంపై వస్తున్న విమర్శలకు సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి సమాధానాలిస్తుంటారు. జగన్ మోహన్ రెడ్డికి ప్రభుత్వం తరఫున అధికారప్రతినిధిగా ఆయన వ్యవహరిస్తున్నారు. ఉండవల్లి అరుణ్ కుమార్ కి దీటుగా సమాధానం చెప్పగల రాజకీయ నేత సత్తా సజ్జలకు లేదనే చెప్పాలి. ఆర్థిక శాఖామంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి వంటివారికి అన్ని కోణాల్లో సమాధానం చెప్పగల సామర్థ్యం లేదు. ముఖ్యమంత్రి జగన్ సహా వైసీపీలోని అగ్రనాయకుల జాతకమంతా ఉండవల్లికి తెలుసు. అందువల్ల రాజకీయ కోణంలో ఆయనకు గట్టిగా జవాబు చెప్పగల నేతలు వైసీపీలో కరవు అయ్యారు. అందుకే సమాధానం ఇవ్వకుండా సాధ్యమైనంతవరకూ మౌనాన్ని ఆశ్రయించే పరిస్థితులు కనిపిస్తున్నాయి. లేదంటే భంగపాటుకు సిద్ధమై తాడోపేడో తేల్చుకునే క్రమంలోనే ప్రభుత్వం రంగంలోకి దిగాల్సి ఉంటుంది. ఉలుకూ పలుకూ లేకుండా ఊరుకుంటే మాత్రం ఉండవల్లి వాదన ప్రజల్లో తీవ్రమైన చర్చకు దారి తీసే ప్రమాదం కనిపిస్తోంది. ఇది రాజకీయంగా వైసీపీకి తీవ్రమైన నష్టం చేకూరుస్తుంది.

# శ్రీవారి బ్రహ్మోత్సవ దర్శనం

తిరుమల, అక్టోబరు 12శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల సందర్భంగా వెనుకబడిన పేదవర్గాలకు స్వామివారి దర్శనభాగ్యం కల్పించడంపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. తూర్పుగోదావరి, పశ్చిమగోదారి, కృష్ణా, వైజాగ్ లాంటి సుదూర ప్రాంతాల్లోని ఏజెన్సీల నుండి ఉచితంగా బస్సుల ద్వారా తిరుమలకు తీసుకొచ్చి శ్రీవారి దర్శనం కల్పించడంపై ఆయా ప్రాంతాల భక్తులు ఎంతో సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సనాతన హిందూ ధర్మాన్ని వ్యాప్తి చేసేందుకు, మత మార్పిడులను అరికట్టేందుకు రాష్ట్ర దేవాదాయ శాఖ ద్వారా సమరసత సేవా ఫౌండేషన్ సహకారంతో టిటిడి మొదటి విడతలో రూ.25 కోట్లతో 13 జిల్లాల్లో 502 ఆలయాలు నిర్మించిన విషయం తెలిసిందే. ఈ ఆలయాలు నిర్మించిన వెనుకబడిన ప్రాంతాల నుండి పేదవర్గాల వారిని బ్రహ్మోత్సవాల సమయంలో ఆహ్వానించి శ్రీవారి దర్శనం చేయిస్తున్నారు. ఒక్కో జిల్లా నుండి 10 బస్సులు ఏర్పాటుచేసి భక్తులను ఉచితంగా తిరుమలకు తీసుకువస్తున్నారు. తూర్పుగోదావరి, విశాఖ జిల్లాల్లో ఏజెన్సీ ప్రాంతాలు ఎక్కువగా ఉండడంతో 20 బస్సులు ఏర్పాటు చేశారు. ఈ ప్రకారం 13 జిల్లాల నుండి మొత్తం 150 బస్సులను ఏర్పాటు చేశారు. రోజుకు సుమారు వెయ్యి మంది చొప్పున అక్టోబరు 7 నుండి 14వ తేదీ వరకు 8 రోజుల్లో 7,350 మందికి టిటిడి శ్రీవారి బ్రహ్మోత్సవ దర్శనం చేయిస్తోంది. తిరుమల శ్రీవారి దర్శనంతోపాటు తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని కూడా భక్తులు దర్శించుకుంటున్నారు. దూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు మార్గమధ్యంలో స్థానిక దాతల సహకారంతో ఆహార పానీయాలు అందించేందుకు టిటిడి ఏర్పాట్లు చేపట్టింది.

## ఘనంగా జాతీయ కళాజీవ పురస్కారాలు ప్రదానం

ప్రోత్సాహంతోనే ప్రతిభకు మెరుగులు

- సమైక్యత, సృజన నైపుణ్య నగరం విశాఖ

- ఏ.పి. మారిటైం బోర్డు ఛైర్మన్ "కాయల"

విశాఖపట్నం అక్టోబర్ 12:సమాజములో ఏ రంగంలోనైన ప్రోత్సాహంతోనే ప్రతిభకు మెరుగులు దిద్దడం జరుగుతుందని ఏ.పి. రాష్ట్ర 'మారిటైమ్ బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి పేర్కొన్నారు. సీతమ్మధార ? వి.జె.ఎఫ్. వినోద వేదికలో మంగళవారం జరిగిన "3 రోజులు మోహిని యాట్టం సదస్సు ముగింపు, కళాజీవా పురస్కారం లు- 2021 ప్రధానోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సృజనాత్మకతకు, సమైక్యతకు ప్రతీక మన విశాఖ నగరమని అన్నారు. గాయత్రి ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కాండ్రే గుల రామ్ కుమార్ మాట్లాడుతూ బాలల్లో కళానైపుణ్యానికి ఇటు వంటి సదస్సులు అవసరమని స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ సంస్థ ను ఆయన అభినందించారు.సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ ప్రత్యేక ఆహ్వానితులు . వైజాగ్ జర్నలిస్ట్ లు ఫోరమ్ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ ఎంతో మంది 'అంతర్జాతీయ స్థాయి ఖ్యాతిని పొందిన కళాకారులు విశాఖలో ఉన్నారన్నారు. కొరియోగ్రఫీలో వైవిధ్యం ఉండడంతో ఎటువంటి కళాభిమానులనైనా ఇట్టే ఆకట్టుకోగలరన్నారు. చిత్ర కళలో జాతీయ పురస్కారాలు అందుకుంటున్న సి. సంధ్యా శంకర పట్నాయక్, సినీ కొరియోగ్రఫర్, మోహినియాట్టం శిక్షకురాలు వినిత వర్గీషే (కేరళ) లను "కళాజివా పురస్కారం-2021 " తో కాయల ఘనంగా సత్కరించారు. కొరియోగ్రఫర్ ఆర్. నాగరాజ్ పట్నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమం లో బ్రహ్మకుమారి రామేశ్వరి, వీ జే ఎఫ్. కార్యదర్శి సోడిశెట్టి దుర్గారావు, ఎ.పి.డిప్లొమో ఇంజనీర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి. మహేశ్వర రెడ్డి , కె.వి.ఆర్. మిత్ర మండలి ప్రతినిధి కె. సూరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అరకు కాఫీకి అంతులేని డిమాండ్

విశాఖపట్టణం, అక్టోబరు 12, (న్యూస్ పల్స్) ఆంధ్రప్రదేశ్‌లోని అరకులోయ గిరిజన రైతులు పండించే కాఫీకి అంతర్జాతీయ అవార్డు లభించింది. ఫ్రాన్స్‌లోని పారిస్‌లో ప్రిక్స్ ఎపిక్యూరెస్ ఓఆర్ 2018 అవార్డులో పసిడి బహుమతి గెలుచుకుంది. అరకు కాఫీని బ్రాండ్‌ను మహీంద్రా అండ్ మహీంద్రా ఛైర్మన్ ఆనంద్ మహీంద్రా డైరెక్టరుగా ఉన్న నాంది ఫౌండేషన్ ప్రపంచవ్యాప్తంగా పరిచయం చేస్తోంది. గతేడాదే ఈ కాఫీ పొడిని పారిస్‌లో అమ్మడం ప్రారంభించారు. అక్కడి ప్రసిద్ధ మాల్స్ లో, సొంత విక్రయ శాలలో కూడా అందుబాటులోకి తెచ్చారు. దీనితో అక్కడి వారిని నచ్చిన కొలంబో, సుమత్రా వంటి ప్రసిద్ధ కాఫీ గింజల సరసన అరకు కాఫీ ధీటుగా నిలిచింది. ఫ్రాన్స్ లోని పారిస్ లో ప్రిక్స్ ఎపిక్యూరెస్ ఓ.ఆర్ 2018 అవార్డులలో అరకు కాఫీ పసిడి బహుమతి గెలుచుకుంది. ఈ కాఫీ బ్రాండ్ ను మహీంద్రా అండ్ మహీంద్రా చైర్మన్ఆనంద్ మహీంద్రాడైరెక్టర్‌గా ఉన్న నాంది ఫౌండేషన్ ప్రపంచ వ్యాప్తంగా పరిచయం చేస్తోంది. కేవలం గింజలే కాకుండా కాఫీ ఆకులతో సైతం అరకు రైతులు అదనపు ఆదాయాన్ని అర్జిస్తున్నారు. నేచురల్ ఫార్మసీ ఇండియా అనే సంస్థ 'అరకు చాయ్' పేరుతో కెఫిన్ తక్కువగా, కృత్రిమ రుచులకు దూరంగా ఉండేలా గ్రీన్ టీని తయారుచేస్తోంది.అరకు కాఫీని అంతర్జాతీయ బ్రాండ్‌గా తీర్చిదిద్దాలన్న తొలి ఆలోచన రెడ్డీస్ ల్యాబొరేటరీస్ వ్యవస్థాపకుడు అంజిరెడ్డిది.¯ ల్యాబొరేటరీస్‌కు చెందిన సతీష్‌రెడ్డి... ఈ నలుగురూ అరకు కాఫీ వీరాభిమానులే.ˇ ప్రాంతానికో, ఒక దేశానికో పరిమితం కాకూడదని బలంగా విశ్వసించేవారే. ఆ అభిమానంతోనే అరకు గ్లోబల్ హోల్డింగ్స్‌కు శ్రీకారం చుట్టారు.

# 23 నియోజకవర్గాల్లో పటిష్టతకు పక్కా ప్లాన్

విజయవాడ, అక్టోబరు 12న్యూస్ పల్స్) ఏపీలో గత ఎన్నికల్లో వైసీపీ 151 నియోజకవర్గాల్లో అధికారంలోకి వచ్చింది. ఓడిపోయిన 24 నియోజకవర్గాల్లో రాజోలులో జనసేన, 23 చోట్ల టీడీపీ విజయం సాధించింది. ఎన్నికలకు మరో మూడున్నరేళ్ల సమయం ఉన్నా కూడా జగన్ పార్టీ ఓడిపోయిన నియోజకవర్గాల్లో పార్టీని పటిష్టం చేసే నాయకుల కోసం ఇప్పటి నుంచే అన్వేషణ స్టార్ట్ చేసేశారు. ఈ క్రమంలోనే పార్టీ గత ఎన్నికల్లో ఓడిన పాలకొల్లు, పెద్దాపురం, రాజమండ్రి సిటీ లాంటి చోట్ల ఇప్పటికే నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లను మార్చేశారు. ఇక టీడీపీ ఎమ్మెల్యేలు వైసీపీకి చేరువ అవుతోన్న నియోజకవర్గాల్లో పార్టీ నేతలకు ఏదో ఒక పదవి ఇస్తూ ఎక్కడా అసమ్మతి లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు.ఈ క్రమంలోనే పార్టీ నాలుగు చోట్ల ఓడిన జిల్లాల్లో విశాఖపట్నం, ప్రకాశం జిల్లాలు ఉన్నాయి. విశాఖలో వైసీపీ ఆపరేషన్ దాదాపు పూర్తయినట్టే. ఒక్క తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు మినహా.. మిగిలిన ముగ్గురిలో వాసుపల్లి గణేష్ ఇప్పటికే ఫ్యాన్ కిందకు రాగా, మరో ఇద్దరు ఎమ్మెల్యేలుగా ఉన్న మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, గణబాబు ఇద్దరూ రేపో మాపో ఫ్యాన్ పార్టీలోకి వెళ్లిపోతారనే అంటున్నారు. ఇక ఇప్పుడు జగన్ టార్గెట్ ప్రకాశం జిల్లా పైనే ఉందంటున్నారు. పార్టీ ఎంతో బలంగా ఉన్న ఈ జిల్లాలో టీడీపీ ఏకంగా నాలుగు స్థానాలు గెలుచుకోవడం జగన్‌కు ఎంత మాత్రం రుచించడం లేదట.ఈ క్రమంలోనే టీడీపీ గెలిచిన నాలుగు నియోజకవర్గాల్లోని రాజకీయ పరిస్థితులు, నాయకుల సామర్థ్యం, ఓటమికి కారణాలపై నివేదికలు తెప్పించుకున్న జగన్ నాయకత్వ మార్పుపై కొద్ది నెలల క్రితమే అంచనాలకు వచ్చారట. అయితే వీరిలో చీరాలలో సీనియర్ నేత కరణం బలరాం వైసీపీ సానుభూతిపరుడిగా మారడంతో పాటు ఆయన తనయుడు వెంకటేష్‌కు వైసీపీ కండువా కప్పించడంతో చీరాల విషయాన్ని జగన్ పక్కన పెట్టి ఇప్పుడు అద్దంకి, పరుచూరు, కొండపి నియోజకవర్గాలపై కాన్‌షంట్రేషన్ చేసినట్టు తెలుస్తోంది. అద్దంకి నియోజకవర్గ నాయకత్వం విషయంలో జగన్ ముందు నుంచి అసంతృప్తితో ఉన్నారు. అయితే గత ఎన్నికల్లో తాను ఇచ్చిన మాట కోసమే గరటయ్యకు సీటు ఇవ్వగా ఆయన ఓడిపోయారు.ప్రస్తుతం అక్కడ గరటయ్య తనయుడు బాచిన కృష్ణ చైతన్య నియోజకవర్గ




ఇన్‌చార్జ్‌గా ఉన్నారు. గొట్టిపాటి రవిని ఢీకొట్టే విషయంలో చైతన్య సామర్థ్యంపై జగన్‌కు సందేహాలు ఉండడంతో అక్కడ కొత్త నేత కోసం ఓ వైపు అన్వేషిస్తూనే మరోవైపు తమ పార్టీ పాత మిత్రుడు, సిట్టింగ్ ఎమ్మెల్యే రవి పార్టీలోకి వస్తాడా ? అని వెయిట్ చేస్తున్నారు. ఇక పరుచూరు విషయంలో జగన్‌కు నాలుగేళ్ల నుంచి తలనొప్పులు తప్పడం లేదు. గొట్టిపాటి నరసయ్యతో ప్రారంభిస్తే గొట్టిపాటి భరత్, రావి రామనాథం బాబు, దగ్గుబాటి వెంకటేశ్వరరావు ఇప్పుడు మళ్లీ రావి రామనాథం బాబుతో పార్టీని నడిపిస్తున్నారు. ఇంత మందిని ఇక్కడ మార్చినా పార్టీ ఇప్పటకీ కునారిల్లుతోందిపర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు వైసీపీ ఆశలు పెట్టుకున్నా అవి నెరవేరలేదు. ఇక ఇప్పుడు ఆయన ఏకంగా బాపట్ల పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు అవ్వడంతో వైసీపీకి ఏకుమేకయ్యే పరిస్థితి ఉంది. ఈ క్రమంలోనే రావి రామనాథం బాబును ఢీ కొట్టే బలమైన నేత కోసం అన్వేషణ జరుగుతోంది. కమ్మ వర్గం నేతలకే ఇక్కడ అవకాశం ఇవ్వాలని చూస్తున్నారు. చీరాల సమస్య పరిష్కారానికి ఇక్కడకు మాజీ ఎమ్మెల్యే ఆమంచిని పంపాలని చూస్తోన్నా అది ఫలించేలా లేదు.ఇక కొండపిలో మొన్న ఓడిన మాదాసు వెంకయ్యకు డీసీసీబీ చైర్మన పదవి ఇవ్వడంతో ఆయన్ను పక్కన పెట్టి మరో బలమైన నేత కోసం అన్వేషణ ప్రారంభమైంది. టీడీపీ ఎమ్మెల్యే స్వామికి గేలం వేస్తూనే వరికూటి అశోక్‌కుమార్, జూపూడి ప్రభాకర్‌రావుతో పాటు మరి కొందరి నేతల పేర్లు ఇక్కడ పరిశీలనలో ఉన్నాయి. మరి జగన్ కాన్‌సంట్రేషన్లతో ఈ మూడు నియోజకవర్గాల సిట్టింగ్ నేతల గుండెల్లో రైళ్లు పరిగెడుతోన్న పరిస్థితే ఉంది.

## హనుమంత వాహనంపై వేంకటాద్రిరామునిగా శ్రీ మలయప్పస్వామివారు

తిరుమల ఆక్టోబరు 12 శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజు మంగళవారం ఉదయం 9 గంటలకు శ్రీవారి ఆలయంలోని కల్యాణోత్సవ మండపంలో శ్రీ మలయప్పస్వామివారు వేంకటాద్రిరాముని అలంకారంలో దర్శనమిచ్చారు. హనుమంత వాహనం - భగవత్ భక్తి ప్రాప్తిహనుమంతుడు భగవత్ భక్తులలో అగ్రగణ్యుడు. రామాయణంలో మారుతి స్థానం అద్వితీయం. చతుర్వేద నిష్ణాతుడుగా, నవవ్యాకరణ పండితుడుగా, లంకాభీకరుడిగా ప్రసిద్ధుడైన ఆంజనేయుడు వేంకటాద్రివాసుని మూపున వహించి దర్శనమిచ్చారు. గురు శిష్యులైన శ్రీరామ హనుమంతులు తత్త్వ వివేచన గావించిన మహనీయులు కనుక వాహ్య వాహకరూపంలో ఈ ఇరువురినీ చూసిన వారికి వేదాలతత్త్వం ఒనగూరుతుంది. ముఖ్యమంత్రి సంప్రదాయాలు పాటించే వ్యక్తి

## మంత్రాలయం పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ సుబుదేంద్ర తీర్థ స్వామి

తిరుమల ఆక్టోబరు 12 ముఖ్యమంత్రి శ్రీ వైఎస్ జగన్మోహన్ రెడ్డి చాలా సాధారణంగా ఉంటూ సంప్రదాయాలకు విలువ ఇచ్చేవ్యక్తి అని మంత్రాలయం పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ సుబుదేంద్ర తీర్థ స్వామి చెప్పారు. టీటీడీ చైర్మన్ శ్రీ వైవి సుబ్బారెడ్డి దంపతులు, ఈవో డాక్టర్ కెఎస్ జవహర్ రెడ్డి దంపతులు, అదనపు ఈవో ధర్మారెడ్డి దంపతులు మంగళవారం తిరుమల లోని శ్రీ రాఘవేంద్ర స్వామి మఠాన్ని సందర్శించి స్వామి వారి పూజలో పాల్గొన్నారు. అనంతరం వీరు పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ సుబుదేంద్ర తీర్థ స్వామివారిని కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీశ్రీశ్రీ సుబుదేంద్ర తీర్థ స్వామి మాట్లాడుతూ, రాఘవేంద్రస్వామివారి కుల దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి అన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమలకు రావడం ఇదే తొలిసారి అని చెప్పారు. స్వామివారి ఆదేశంతో తిరుమల కు వచ్చి శ్రీ వేంకటేశ్వర కన్నడ భక్తి ఛానల్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొనడం స్వామివారి దయతోనే జరిగిందన్నారు. కార్యక్రమం చాలా బాగా, సంప్రదాయ బద్ధంగా నిర్వహించారని టీటీడీని అభినందించారు.

# బద్వేలులో ఇంటర్ విద్యార్థినికి వేధింపులు

కడప అక్టోబరు 12, (న్యూస్ పల్స్)బద్వేలులో ఇంటర్ విద్యార్థినికి వేధింపులు ఎదురయ్యాయి. సిద్దుగారిపల్లె గ్రామానికి చెందిన సుమిత్ర అనే విద్యార్థినిని ప్రేమ పేరుతో శంకర్ రెడ్డి నిత్యం వేధింపులకు గురిచేస్తున్నాడు. అదే గ్రామం నుంచి బద్వేల్ కు శంకర్ రెడ్డి ఆటో నడుపుకుంటున్నాడు.బాధితురాలు నిత్యం అతని ఆటోలోనే బద్వేల్ లో కాలేజికి వెళుతోంది. శంకర్ రెడ్డి మల్లంపేట గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ గా గుర్తించారు. విద్యార్థిని ధైర్యం చేసి తల్లిదండ్రులకు విషయం చెప్పడంతో ఆటో డ్రైవర్ ను ఇంట్లో నిర్బంధించారు. తరువాత దేహశుద్ధి చేసిని గ్రామస్థులు పోలీసులకు అప్పజెప్పారు.

# ఇంద్రకీలాద్రి వద్ద అధికారుల అత్యుత్సాహం

### ఎంపీ వాహానాన్ని నిలిపివేసిన పోలీసులు

విజయవాడ అక్టోబరు 12, (న్యూస్ పల్స్)ఇంద్రకీలాద్రి వద్ద అధికారుల అత్యుత్సాహం ప్రదర్శించారు. మంగళవారం నాడు అమ్మావారి దర్శనానికి వచ్చిన విజయవాడ ఎంపీ కేశినేని నాని వాహనాన్ని ఘాట్ రోడ్డు ప్రారంభం లోనే పోలీసులు నిలిపివేసారు. స్థానిక ఎంపీగా ప్రోటోకాల్ పాటించక పోవడం పై ఎంపీ అసహనం వ్యక్తం చేసారు. తన కుటుంబ సభ్యులతో కలసి కాలి నడకనే ఇంద్రకీలాద్రి పైకి వెళ్లి పట్టు వస్త్రాలు సమర్పించి నడిచి కిందకు వచ్చారు. వీఐపీ పాస్ లతో ఇతర వాహనాలను అనుమతిస్తూ ఎంపీ వాహనాన్ని అడ్డుకోవడంపై ఎంపీ సహాయకులు మండిపడ్డారు.

## రోడ్డు భద్రతపై సమీక్షలో పాల్గొన్న జిల్లా ఎస్పీ

కాకినాడ అక్టోబరు 12, (న్యూస్ పల్స్)రోడ్డు భద్రతా ? ప్రమాదాల నియంత్రణ" అంశంపై వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి జిల్లా ఎస్పీ .రవీంద్రనాథ్ బాబు హజరయ్యారు. మంగళవారం నాడు జు రాష్ట్ర పోలీస్ ప్రధాన కార్యాలయం నుండి అడిషనల్ డీజీపీ రవిశంకర్ అయ్యనార్, రోడ్ సేఫ్టీ అథారిటీ ఛైర్మన్, కృపానంద్ త్రిపాఠి, ల నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సమీక్షా సమావేశంలో స్టేట్ హైవే, నేషనల్ హైవే మరియు ఇతర గుర్తించబడిన బ్లాకు స్పాట్ లలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు, చేపడుతున్న కార్యక్రమాలు, రోడ్ సేఫ్టీ పరికరాల సేకరణ వాటి ఉపయోగం, రోడ్డు భద్రతకు సంబందించి అన్ని శాఖల సమన్వయంతో సైనేజ్ బోర్డులు, లైటింగ్ సిస్టం, పెయింటింగ్ వర్క్స్, ట్రాఫిక్ కోన్స్ తదితర రోడ్డు ఇంజనీరింగ్ సంబంధిత అంశాలపై ఈ సమీక్షా సమావేశంలో చర్చించి జిల్లా ఎస్పీల నుండి సూచనలు, సలహాలు కోరారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ తూర్పుగోదావరి జిల్లాలో చేపడుతున్న వారంలో రెండు రోజుల "నో అక్సిడెంట్ డే" ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమం గురించి వివరించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ఒక నిర్దేశిత కార్యక్రమాన్ని అమలు చేస్తునట్లు, అదేవిధంగా సీఎస్ఆర్ క్రింద రోడ్ సేఫ్టీ నిమిత్తం నిధుల సమీకరణలో భాగంగా పరిపాలనా అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసామని అన్నారు. గుర్తించబడిన బ్లాక్ స్పాట్ లలో రోడ్డు ఇంజనీరింగ్ పనులను చేపట్టే కార్యక్రమాలను ఈ నెలలో చేపట్టనున్నట్లు ఉన్నత అధికారులకు వివరించారు.

# కళ తప్పుతున్న చెరువులు, రిజర్వాయర్లు

నెల్లూరు, అక్టోబరు 12, (న్యూస్ పల్స్) అక్రమార్కుల కళ్లల్లో పడితే పంచభూతాలు కూడా కనుమరుగై పోతున్నాయి. ప్రభుత్వం ఎంతో సదుద్దేశ్యంతో ఎండిపోతున్న చెరువులకు జలకళ కల్పించవచ్చనే ఆలోచనతో చెరువుల్లో మట్టిని తవ్వకొని ఉచితంగా తరలించుకుపోయే అవకాశాన్ని కల్పించింది. ఇందుకోసం ప్రత్యేకంగా జీఓ నెం.40ను రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. ఇసుక తరహాలోనే మట్టిని కూడా రైతులు భూముల సారవంతానికి, ఇతర అవసరాలకు తరలించుకునేలా జీఓలో పేర్కొన్నారు. గతంలో చెరువుల్లోని మట్టిని తరలించుకు పోవాలంటే ప్రభుత్వానికి సీనరేజ్ చెల్లించడంతో పాటు జిల్లా కలెక్టర్ నుండి అనుమతులు పొందాల్సి ఉంటుంది. కానీ ప్రస్తుతం సవరించిన నిబంధనల మేరకు జలవనరుల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ స్థాయి అధికారి అనుమతులు ఇస్తే సరిపోతుంది. దీంతో అక్రమార్కుల పని మరింత సులువైంది. వీరి ధన దాహానికి జిల్లాలోని చెరువులు, రిజర్వాయర్ల రూపురేఖలు మారిపోతున్నాయి. ఇష్టారీతిగా నిబంధనలనేవీ పాటించకుండా వీరు చెరువులో ఎక్కడ పడితే అక్కడ గుంతలు తవ్వి మట్టిని తరలించుకు పోతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సంబంధిత చెరువు ఆనకట్ట ఎత్తుకు పదింతలు దూరం వరకు చెరువులో ఎటువంటి తవ్వకాలు జరపకూడదు. ఉదాహరణకు చెరువుకట్ట ఎత్తు 5 మీటర్లు ఉందనుకుంటే.. ఆ చెరువులో కట్ట నుండి 50 మీటర్ల వరకూ ఎటువంటి మట్టి తవ్వకాలు జరపకూడదని నిబంధనల్లో స్పష్టంగా పేర్కొన్నారు. కానీ అక్రమార్కులు కట్ట సమీపం నుండే పెద్దపెద్ద గుంతలు తవ్వి మట్టిని తరలించుకు పోతున్నారు. దీంతో భవిష్యత్తులో చెరువు కట్టలకు ప్రమాదం ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. తేలికపాటి జల్లులకు కూడా కట్టల్లో మట్టి కరిగిపోయి కట్టలు తెగిపోయే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. గూడూరు డివిజన్‌లోని కోట చుట్టుపక్కల ప్రాంతాల్లో స్వర్ణముఖి నుండి వచ్చే పంట కాలువల్లో కొందరు అక్రమంగా మట్టిని తరలించుకు పోతున్నారు. గూడూరు తహశీల్దార్ కార్యాలయం సమీపంలోని ఓ పంట కాలువలో పట్టపగలే యంత్రాల సహాయంతో మట్టిని తవ్వి తరలించుకుపోతున్నా పట్టించుకుంటున్న నాథుడు లేరు. నెల్లూరు రూరల్ మండలంలోనూ ఇదే తరహాల్లో చెరువుల్లో మట్టిని మాయం చేసేస్తున్నారు. ప్రభుత్వం తరలించుకునేందుకు అనుమతి ఇవ్వడంతో పాటు నిబంధనలను కూడా జతచేసిన విషయాన్ని అక్రమార్కులు మర్చిపోతు న్నారు.కొందరు మరొక అడుగు ముందుకేసి మట్టి చాటున గ్రావెల్ తరలించుకు పోతున్నారనే ఆరోపణలున్నాయి. ఇటీవల నెల్లూరు రూరల్ మండలంలోని ట్రాక్టర్లను అధికారులు ఆపినప్పటికీ రాజకీయ నేతల రంగప్రవేశంతో వారిని ఏమిచేయలేకపోయారు. గ్రావెల్ తరలింపునకు కచ్చితంగా అనుమతులు ఉండాలి. ప్రభుత్వానికి సీనరేజ్ చెల్లించాల్సి కూడా ఉంటుంది. అయితే మట్టి పేరుతో గ్రావెల్‌ను తరలిస్తున్నారు. అధికారుల దాడులు ఉంటాయని భావించే సమయంలో రాత్రిపూట గ్రావెల్ తరలిస్తూ పగటిపూట మట్టిని తరలిస్తున్నవారు కూడా ఉన్నారు. గ్రామాల్లోని చెరువుల్లో మట్టిని తరలించుకునే విషయంలో అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు ఒకేమాటపై ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోకుండా గుట్టుచప్పుడు కాకుండా మట్టిని దోచుకెళ్లిపోతుండడం విశేషం. అధికారులు కూడా రాజకీయ పైరవీలకు తలొగ్గి ఈ మట్టి దోపిడీని నియంత్రించలేక పోతున్నారు.జలవనరుల శాఖ అధికారులు పైరవీలకు భయపడి నిమ్మకు నీరెత్తినట్లు ఉంటే అక్టోబర్, నవంబర్ మాసాల్లో వచ్చే వర్షాలకు చెరువులకు గండ్లు పడే అవకాశాలు ఉన్నాయని రైతులు చెబుతున్నారు.

## డ్వాక్రా గ్రూపులకు ఆసరా చెక్కుల పంపిణీ

పాలకొల్లు పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు డ్వాక్రా మహిళలు సామాజికంగా, ఆర్థికంగా ఎదగాలని ఉద్దేశంతోనే వైయస్సార్ ఆసరా పథకం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అమలు చేస్తున్నారని జడ్పీ చైర్మన్ కౌరు శ్రీనివాస్ తెలిపారు. పాలకొల్లు పట్టణం లైన్స్ క్లబ్ సమావేశ హాలులో డ్వాక్రా గ్రూపు మహిళలకు ఆసరాచెక్కులు పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పట్టణంలోని తొమ్మిది వార్డులోని డ్వాక్రా మహిళలకు సుమారు మూడు కోట్లఆసరా చెక్కులు పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీలను నవరత్నాలు పథకం ద్వారా అవినీతికి తావు లేకుండా నేరుగా బ్యాంకు ఖాతాలకు జమ చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్ కి దక్కింది అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లెం ఆనంద ప్రకాష్ ,మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు, ఎడ్ల తాతాజీ, గూడూరు పెద్దిరాజు చిలుకూరి దత్తాత్రేయవర్మ, సాందక సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయ చైర్ పర్సన్ గా రమాదేవి

విశాఖపట్నం విశాఖ జిల్లా గ్రంథాలయ చైర్మన్ గా కొండా రమాదేవి ప్రమాణస్వీకారం చేశారు.విశాఖ వుడా చిల్డ్రన్ థియేటర్ లో జరిగిన ప్రమాణస్వీకారం కార్యక్రమానికి ఎంపి విజయసాయి రెడ్డి,మంత్రి అవంతి శ్రీనివాస్ రావు పాల్గొన్నారు.గ్రంథాలయాలకు పాఠశాలలు,కళాశాలలకు అనుసంధానం చేసి డిజిటల్ వ్యవస్థకు తగ్గట్టుగా వ్యవస్థలను అభివృద్ధి చెయ్యాల్సిన అవసరం ఉందని ఎంపి విజయసాయి రెడ్డి అన్నారు.సిఎం జగన్ తనకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేస్తానని చైర్మన్ కొండా రమాదేవి తెలిపారు.

## మహిళల ఆర్థిక అభివృద్ధికి పెద్ద పీట

పుట్టపర్తి మహిళల ఆర్థిక అభివృద్ధి కి పెద్ద పీట వేసిన ఘనత సీఎం జగన్ కే దక్కుతుందని రెండో విడత వైఎస్ఆర్ ఆసరా చెక్కులు పంపిణీ కార్యక్రమం లో పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. అనంతపురం జిల్లా ఓ.డి చెరువులో వైయస్సార్ ఆసరా రెండో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహిళా సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. స్థానిక వైయస్సార్ కూడలిలో జరిగిన ఈ కార్యక్రమంలో ఓ.డి చెరువు, నల్లమాడ, అమడగూరు మండలాల్లోని స్వయం సహాయక సంఘాలకు12.48 కోట్ల రూపాయల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళల ఆర్థిక అభివృద్ధికి సహకారం అందించడమే కాకుండా చట్ట సభల్లోనూ ప్రజాప్రతినిధులుగా మహిళలకు రిజర్వేషన్లు కల్పించిన ఘనత సీఎం జగన్ కి దక్కుతుందని పేర్కొన్నారు. మహిళలు ఎక్కడైతే గౌరవించబడతారో, ఎక్కడైతే వారికి భద్రత భరోసా ఉంటుందో ఆ ప్రాంతం సుభిక్షంగా ఉంటుందని తెలిపారు. అత్యాచారాలను అరికట్టేందుకు, మహిళలకు భద్రత కల్పించేందుకు దేశంలో ఎక్కడా లేని విధంగా దిశా చట్టాన్ని సీఎం జగన్ తీసుకు వచ్చినట్లు పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు అధికారంలో ఉండగా రాష్ట్రంలో దుర్భిక్ష మైన పాలన సాగిందని తప్పుబట్టారు. రైతు రుణమాఫీ, డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామని ఉత్తుత్తి హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక ఐదేళ్ల పాటు చంద్రబాబు తన జేబులు నింపుకున్నారన్నారు.

## వర్గీకరణచేస్తామనిమాట ఇచ్చితప్పిన బిజేపి పార్టీని తరిమికోట్టండి

### జాతీయ అధ్యక్షుడు తేనేటి కిషోర్ మాదిగ

నంద్యాల అక్టోబరు 12,( విభారె), :- మంగళవారం నాడు కడప జిల్లా బద్వేలు మండలం గోపవరం హరిత రిసార్ట్స్ లో మాదిగ రిజర్వేషన్ పోరాట సంఘర్షణ సమితి కడపజిల్లా ముఖ్య నాయకుల సమావేశం జరిగిందని తెలిపారు. ఈ సమావేశానికి సభా అధ్యక్షులు గా రాష్ట్ర ఎం ఇ ఫ్ అధ్యక్షులు అంకమ్మ గారి ఓబయ్య అద్యక్షతన జరిగిన సమావేశంలో ఎంఆర్పిఎస్ఎస్ బిజాతీయఅధ్యక్షులు మాన్యశ్రీతెన్నేటికిషోర్బిమాదిగ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన100 రోజులో వర్గీకరణ చేస్తాముఅనిమాట ఇచ్చి బిజేపి పార్టీమాటతప్పారని ఆయన అన్నారు. అడగనటువంటి అగ్రవర్ణాల లో ఆర్థికంగా



వేనుకుబడినవారికి 10/శాతం రిజర్వేషన్లు కల్పించారు. 30 సంవత్సరాలుగా మాదిగలు ప్రాణత్యాగల తో కూడుకున్న ఉద్యమంకు విలువలేకుండా బిజేపి పార్టీ చూస్తుందని ఆయన చెప్పారు. వర్గీకరణ కోసం బిజేపి పార్టీ నోరుమెదపకుంటే వచ్చే 5 రాష్ట్రల ఎన్నికలో బిజేపి పతనం కోసం కష్టపడి పని చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధరూర్ నరేష్ రాయలసీమ జిల్లాల్ల ఇన్చార్జి రామప్పగారి శ్రీనివాస్ కడప జిల్లా అధ్యక్షుడు పి వెంకటరమణ కడప జిల్లా ఎంఇఫ్ అధ్యక్షుడు సోమిరెడ్డిపల్లి జయచంద్ర గొల్లపల్లి బాస్కర్ నాగిపోగు రవికుమార్ నంద్యాల పార్లమెంట్ అధ్యక్షుడు ఆల్లప్ప అనంతపురం యువసేన అధ్యక్షుడు కె గిరి తదితరులు పాల్గొన్నారు.

## మంత్రాలయం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి సిపిఎం పార్టీ డిమాండ్

మంత్రాలయం అక్టోబరు 12,( విభారె) : మంత్రాలయం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి జయరాజు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మండల తాసిల్దార్ కార్యాలయం ఆవరణలో మాట్లాడుతూ ఈ సంవత్సరం మండలంలో వర్షపాతం చాలా తక్కువగా నమోదు కావడం వల్ల పంటలు సరిగా పండక పెట్టుబడి రాక కు వచ్చిన పంట కూలీలకు కూడా సరిపడక రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు సరిగా లేక వేసిన పంటలు సరిగా చేతికి రాక అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టినా ప్రయోజనము లేక పోయిందని వారు అన్నారు.ఎలాంటి షరతులు లేకుండా ఎకరాకు 25000 పంట నష్టపరిహారం ఇవ్వాలని , పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని ,పంటలకు బీమా పరిహారం మంజూరు చేయాలని , కౌలు రైతులకు పంట నష్టపరిహారం ఇవ్వాలని ,బ్యాంకుల్లో రైతులు తీసుకున్న అప్పులు మాఫీ చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# రాష్ట్ర మహాసభల ను జయప్రదం చేయండి

### ఏ.ఐ.ఎస్.ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జి.రంగన్న

నందికొట్కూరు అక్టోబర్ 12( విభారె). జిల్లాలో మొదటిసారిగా జరగనున్న అఖిల భారత విద్యార్థి సమాఖ్య 48వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.రంగన్న పిలుపునిచ్చారు. మంగళవారంనందికొట్కూరు పట్టణంలో జైకిసాన్ పార్క్ నందు అఖిల భారత విద్యార్థి సమైక్య ఏ.ఐ. యస్.ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడు శ్రీనివాసులు అధ్యక్షతన మాజీ విద్యార్థి సంఘం నాయకుల ఆత్మీయుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ జాతీయ కార్యదర్శి రామంజినేయులు మాట్లాడుతూ కర్నూల్ నగరంలో 48 వ రాష్ట్ర మహాసభలను ఈ నెల 29, 30, 31,వ తేదీలలో ఘనంగా నిర్వహించడం జరుగుతుందని మహాసభలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అంతేకాకుండా ప్రయివేటు కార్పొరేట్ రంగానికి వ్యతిరేకంగా విద్యారంగంలో విద్యార్థుల సమస్యలపై రాజీలేని పోరాటాలు చేసిన విద్యార్థి సంఘం ఏ.ఐ.యస్.ఎఫ్. ఉద్యమాలలో అగ్రగామి గా నిలిచింది అని వారు పేర్కొన్నారు.సమావేశా ముఖ్య అతిధి రాష్ట్ర కార్యదర్శి జి.రంగన్న మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం పేరుతో రాష్ట్రాల హక్కులను కేంద్రం హరించి వేస్తోందని, రాష్ట్రం కూడా గుడ్డిగా అమలు చేస్తోందని విమర్శించారు. అమ్మఒడి, విద్యా దీవెన తీసుకొచ్చి విద్యార్థులకు ఉపకారవేతనాలు, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం దూరం చేస్తోందన్నారు. విశ్వవిద్యాలయాల్లో సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. సభల్లో మొదటిరోజు భారీ బహిరంగ సభ, రెండు రోజులపాటు అన్ని జిల్లాల నుంచి 600 మంది ప్రతినిధులు హాజరుకానున్నారన్నారు.నూతన




విద్యావిధానం లో మార్పులు తీసుకోవరవాలి అని పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు నేడు "విద్య అనేది అందని ద్రాక్ష" మారిందని వారు ఆవేదన వ్యక్తంచేశారు. ప్రయివేటు విద్య సంస్థలో ఫీజుల దోపిడీ ఎక్కుగా ఉందని విద్యార్థుల రక్తాన్ని కరోన వైరస్ లా పట్టి పిడుస్తున్నారని ప్రభుత్వములు వారిపై చర్యలకు వెనుకడుతూ తొత్తులుగా మారిపోయారని విమర్శించారు అంతేకాకుండా విద్యార్థులు వేలాదిగా తరలివచ్చి రాష్ట్ర మహా సభలను విజయవంతం చేయాలని పిలునిస్తూ రాష్ట్రంలో మాజీనాయకుల సహాయ సహకారాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీరాములు, ధనుంజయుడు, జిల్లా సహాయ కార్యదర్శి రసూల్, నందికొట్కూరు మాజీ ఏఐఎస్ఎఫ్ నాయకులు పంచరత్నం, రమేష్ నాయుడు, రబ్బానీ జాకీర్, నారాయణ, షేక్షావలి, దానయ్య, చింత శీను, చిన్న రాజు,మార్కెట్ రాజు, గోపి, రఘు రామ్మూర్తి,జగదీష్ బాబు, రమేష్ బాబు, శ్రీనివాసులు, వెంకటేష్, శేషన్న లు హాజరయ్యారు

## మాజీ రోటరీ క్లబ్ అధ్యక్షులు, కార్యదర్శి లకు ఘనంగా సన్మానం




దోన్అక్టోబరు 12,( విభారె) మాజీ రోటరీ క్లబ్ అధ్యక్ష,కార్యదర్శి లకు రోటరీ క్లబ్ అధ్యక్షులు జింకల కృష్ణ, కార్యదర్శి శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో మాజీ అధ్యక్షులు శంకర్ గౌడ్,కార్యదర్శి బి. దశతరమా రెడ్డి లకు ఘనంగా సన్మానించారు, స్థానిక రోటరీ భవనం నందు మంగళవారం ఉదయం రోటరీ క్లబ్ డోన్12/10/21 తేదీన2020 సంవత్సరం ప్రెసిడెంట్ జి శంకర్ గౌడ్, సెక్రటరీ బి. దశరథరామిరెడ్డి గార్లు చేసిన రోటరీ సర్వీసులకు గాను 20 20 సంవత్సరం డిస్ట్రిక్ట్ గవర్నర్ నంద్యాల చిన్న రెడ్డి గారు28/09/21 తేదీన డోన్ రోటరీ క్లబ్ త్రీ స్టార్ ఛాంపియన్ క్లబ్ అవార్డు మరియు త్రీ స్టార్ ఛాంపియన్ ప్రెసిడెంట్ అవార్డు జి శంకర్ గౌడ్ గారికి ఇవ్వడమైనది అందుకుగాను జి శంకర్ గౌడ్ గారికి ,బి దశరథరామిరెడ్డి గారికి డోన్ రోడ్డు క్లబ్ ప్రెసిడెంట్ జింకల కృష్ణ గారు సెక్రటరీ శేఖర్ యాదవ్ రోటరీ క్లబ్ సభ్యులు రాజా విజయకుమార్ , జగన్ మోహన్ సార్, ఏ సి పుల్లారెడ్డి రాజ గౌడు ,సత్య సేనా రెడ్డి, కత్తార్ వెంకటేశ్వర్లు, ఎస్ బలరాం, లింగమయ్య ,గౌండ శాలు ,లారీ మద్య ,లారీ హనుమంతు, తదితరులు సన్మానం చేయడమైనది డోన్ రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ జింకల కృష్ణ గారు మాట్లాడుతూ సర్వీస్ యాక్టివిటీస్ లో డోన్ రోటరీ క్లబ్ కు మంచి గుర్తింపు ఉందని డోన్ నగర ప్రజలకు 2021 సంవత్సరానికిగానూ ఇంకా మంచి సర్వీసులు అందించి డోన్ రోటరీ క్లబ్ కు ఇలాంటి ఎన్నో అవార్డ్స్ రావడానికి నా వంతు కృషి చేస్తానని రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ జింకల కృష్ణ అన్నారు

## డోన్ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలిసీపీఎం



డోన్ అక్టోబరు 12,( విభారె) డోన్ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి టి.శివరాం,పార్టీ నాయకులు కోయిలకొండ నాగరాజు,చిన్న రహమాన్, నక్కీ శ్రీకాంత్ లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మంగళవారం మండలంలోని దేవరబండ గ్రామ పరిధిలోని పంట పొలాలను సిపిఎం నాయకులు పరిశీలించి పుల్లన్న,హుస్సేన్ భాష అనే రైతులతోమాట్లాడారు.ఎకరాకు 30 వేల రూపాయలకు పైగా పెట్టుబడులు పెట్టామని సకాలంలో వర్షాలు కురవక ఎకరాకు నాలుగు ఐదు వేల రూపాయలకు సరిపడా దిగుబడులు కూడా రావని పెట్టిన పెట్టుబడి కూడా రాకుంటే మా కుటుంబాలను ఏ విధంగా బ్రతికించు కోవాలని నాయకుల వద్ద రైతులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు.అనంతరం నాయకులు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ముఖ్యంగా వేరుశనగ,కంది, ఆముదం పంటలను వేస్తారని వర్షాభావం వల్ల పంటలుఎండిపోతున్నాయని నిన్న, మొన్న కురిసిన వర్షాలకు పైకి పచ్చగా కనపడుతున్నా లోపల మాత్రం వేరుశెనగ కాయలు చెట్టు కు ఒకటి రెండు తప్ప ఎక్కువగా లేవని ఎకరాకు రెండు బస్తాల దిగుబడి రావడం కూడా కష్టమే అని అన్నారు.కంది ఆముదం పంటల పరిస్థితి కూడా అదే విధంగా ఉందన్నారు.పొలాలనే నమ్ముకొని అప్పోసప్పో చేసి విత్తనాలకు,ఎరువులకు, కలుపులకు పెట్టుబడులు పెట్టిన రైతులు ఆ పెట్టుబడులు కూడా రాక అప్పులపాలై విధిలేని పరిస్థితులలో రైతులు ఆత్మహత్యల వైపు ఆలోచనలు చేస్తున్నారని,దేశానికి అన్నం పెట్టే రైతన్నల గోడు ఈ ప్రభుత్వాలకు ఏమాత్రం పట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా డోన్ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి,ఎకరాకు 50 వేల రూపాయలు నష్టపరిహారాన్ని ప్రకటించి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.లేనియెడల రైతులను సమీకరించి ఉద్యమిస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ మండల అధ్యక్షుడు హబీబ్ భాషా,ఉపాధ్యక్షుడు కే శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ఎనిమిది పదుల వయసులోనూ ఆయనే నెం.1




బాలీవుడ్ మెగా స్టార్ అమితాబచ్చన్ పుట్టిన రోజు నేడు. ఈ సందర్భంగా ఆయనకు దేశ వ్యాప్తంగా ప్రముఖుల నుండి మరియు సాధారణ సినీ ప్రియుల నుండి మరియు రాజకీయ నాయకుల నుండి పుట్టిన రోజు శుభాకాంక్షలు అందుతున్నాయి. అమితాబచ్చన్ ఎనిమిది పదుల వయసులో కూడా వరుసగా సినిమాలను చేస్తూనే ఉన్నారు. ఏడాదికి మూడు నాలుగు సినిమాలకు తగ్గకుండా సినిమాలను చేస్తూ వస్తున్నారు. వయసుకు తగ్గ పాత్రలను చేస్తూ స్టార్ హీరోల సినిమాలో క్యారెక్టర్ ఆర్టిస్టుగా కూడా చేస్తున్న అమితాబచ్చన్ ఈ వయసులో కూడా అత్యధిక కంపెనీలకు బ్రాండ్ అంబాసిడర్ గా వ్యవహరిస్తున్నారు. ఇండియన్ సెలబ్రెటీల్లో అత్యధిక బ్రాండ్స్ కు అంబాసిడర్ గా వ్యవహరిస్తున్నది ఎవరు అంటే మరో డౌట్ కూడా అక్కర్లేదు అమితాబ్ పేరు చెప్పేయవచ్చు.ఆయన దరిదాపుల్లో కూడా ఎవరు లేరు. ఆయనకు ఆల్ ఇండియా గుర్తింపు ఉన్న కారణంగా కొన్ని జాతీయ స్థాయి బ్రాండ్స్ ఆయన్ను అంబాసిడర్ గా ఎంపిక చేస్తున్నారు. అమితాబచ్చన్ ఒక కంపెనీ ప్రచార కర్తగా ఎంపిక అయితే దాని కోసం ఇతర భాషల్లో వేరే స్టార్స్ ను తీసుకోవాల్సిన అవసరం లేదు. ఎందుకంటే ఆయనకు దేశ వ్యాప్తంగా గుర్తింపు ఉంది. ఒక్కో బ్రాండ్ కు నాలుగు నుండి ఆరు కోట్ల రూపాయల వరకు పారితోషికంగా ఏడాది కాలానికి తీసుకుంటూ ఉంటారు. సినిమాల ద్వారా వచ్చే ఆదాయంకు రెట్టింపు ఆదాయం బ్రాండ్స్ ను ప్రమోట్ చేయడం ద్వారానే అమితాబచ్చన్ కు వస్తున్నాయి అంటూ ప్రముఖ మీడియా సంస్థ ఒకటి ఆమద్య కథనంలో పేర్కొనడం జరిగింది.అమితాబచ్చన్ ను ఎక్కువ కంపెనీలు ఎందుకు ఎంపిక చేసుకుంటున్నాయి అనే విషయమై ఒక సర్వే నిర్వహించగా చాలా మంది ఆయన ఏదైన ప్రొడక్ట్ లేదా వస్తువు లేదా విషయం గురించి చెబుతున్న సమయంలో మన బాగు కోసం ఒక పెద్ద మనిషి చెబుతున్నట్లుగా అనిపిస్తుంది. టీవీలో ఆయన పిల్లలకు సంబంధించిన విషయాలు చెబుతున్న సమయంలో ఒక తాత తమకు చెబుతున్నట్లుగా అనిపిస్తుందని కూడా పిల్లలు భావిస్తారు. అమితాబ్ బ్రాండ్స్ అనగానే ఎక్కువ శాతం ఆకర్షితులు అవుతూ ఉంటారు. అందుకే ఆయన్ను ప్రముఖ కంపెనీలు తమ ఉత్పత్తుల ప్రమోషన్ కోసం కోట్ల పారితోషికం ఇచ్చి మరీ ప్రమోట్ చేయించుకుంటూ ఉంటారు. బచ్చన్ ప్రమోట్ చేసిన కొన్ని పదులు సంస్థలు మరియు ప్రొడక్ట్స్ ఇండియన్ మార్కెట్ లో నెం.1 స్థానంలో నిలిచాయి.ఇది అది కాదు అని అన్ని రకాలుగా ఆయన బ్రాండ్ అంబాసిడర్ గా వ్యవహరిస్తూ ఉంటారు. గుజరాత్ టూరిజం కు బ్రాండ్ అంబాసిడర్ గా వ్యవహరించినా.. కేంద్ర ప్రభుత్వ పథకాలకు ఆయన అంబాసిడర్ గా చేసినా అన్నింటిని కూడా ప్రేక్షకులు ఆసక్తిగా చూస్తున్నారు. ఈమద్య కాలంలో ఒక పాన్ మసాలా బ్రాండ్ కు అమితాబచ్చన్ అంబాసిడర్ గా వ్యవహరించేందుకు భారీ మొత్తంను తీసుకున్నారు. అందుకు సంబంధించిన యాడ్స్ షూట్ కూడా జరిగాయి. కాని నేడు ఆయన పుట్టిన రోజు సందర్భంగా ఆ బ్రాండ్ ను వదిలేస్తున్నట్లుగా ప్రకటించాడు. వారు ఇచ్చిన డబ్బును కూడా తిరిగి పంపించేస్తున్నట్లుగా ప్రకటించారు. ఈ నిర్ణయంను ఆయన అభిమానులతో పాటు అంతా కూడా అభినందిస్తున్నారు. మరో పదేళ్లు అయినా బచ్చన్ జీ ఇలాగే సినిమాలు.. బ్రాండ్స్ తో జనాల ముందుకు రావాలని అభిమానులు కోరుకుంటున్నారు. ఇక నేడు ఆయన బర్త్ డే సందర్భంగా చిరంజీవి.. మహేష్ బాబు.. మోహన్ లాల్.. మమ్ముట్టీ.. కోహ్లీ తో పాటు కొన్ని వందల మంది సెలబ్రెటీలు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# సల్మాన్ ఖాన్ తో డ్యాషింగ్ డైరెక్టర్ సినిమా



సల్మాన్ ఖాన్ కథానాయకుడిగా డ్యాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనుందని కొద్ది రోజులుగా ప్రచారం సాగుతున్న సంగతి తెలిసిందే. పూరి-సల్మాన్ మధ్య ఉన్న స్నేహం కారణంగా ఈ కాంబినేషన్ లో చిత్రం రాబోతుందని ప్రచారం సాగుతోంది. తాజాగా ఆ ప్రచార నిజమనిపించేలా మరో వార్త బయటకు వచ్చింది. ఈ క్రేజీ చిత్రాన్ని నిర్మించడానికి మైత్రీ మూవీ మేకర్స్ ముందుకొచ్చిందిట. సల్మాన్ ఖాన్ ని స్క్రిప్ట్ తో ఒప్పిస్తే తామే సినిమా నిర్మాణానికి ఎంత బడ్జెట్ అయినా ఖర్చు చేస్తామని మైత్రీ మూవీ మేకర్స్ ముందుకొచ్చిందిట. ఈ నేపథ్యంలోనే పూరి తనదైన మార్క్ స్క్రిప్ట్ తో సల్మాన్ ని లాక్ చేసినట్లు సమాచారం.గతంలో పూరి తెరకెక్కించిన కొన్ని సినిమాల్ని సల్మాన్ ఖాన్ హీరోగా హిందీలో రీమేక్ చేయగా అక్కడా బ్లాక్ బస్టర్లు అయ్యాయి. పూరి 'పోకిరి'ని ప్రభుదేవా 'వాంటెడ్' టైటిల్ తో రీమేక్ చేయగా సల్మాన్ కెరీర్ బెస్ట్ హిట్ గా నిలిచింది. పూరి స్క్రిప్టు పై నమ్మకంతో సల్మాన్ ఖాన్ కూడా లైన్ విన్న వెంటనే అంగీకరించినట్లు సమాచారం. ఏదేమైనా ఈ కలయిక క్రేజీ కాంబినేషన్ అనే చెప్పాలి. ఓ పెద్ద స్టార్..మరో పెద్ద దర్శకుడు..అగ్ర నిర్మాణ సంస్థ ఇవన్నీ కలిస్తే పాన్ ఇండియా సినిమా అవుతుందనేది ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఈ కాంబినేషన్ గనుక నిజమైతే ఎన్ని భాషల్లో తెరకెక్కుతుంది అన్నది తెలియాల్సి ఉంది. ఇప్పటికే పూరి బిగ్ బి అమితాబ్ బచ్చన్ 'బుడ్డా' చిత్రాన్ని తెరకెక్కించి విమర్శకుల ప్రశంసలందుకున్నారు.కానీ బాక్సాఫీస్ వద్ద ఆ సినిమా అంతగా రాణించలేదు. తాజాగా పూరి మరోసారి బాలీవుడ్ లో ప్రయత్నం చేస్తున్నట్లు కనిపిస్తుంది. ప్రస్తుతం రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ కథనాయకుడిగా 'లైగర్' చిత్రాన్ని పూరి తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. మేజర్ పార్ట్ షూటింగ్ అంతా ముంబైలోనే జరిగింది. ఈ నేపథ్యంలో పూరి ఎక్కువగా ముంబైలోని ఉంటున్నారు. దీనిలో భాగంగా సల్మాన్ ఖాన్ కి కూడా ఓ సారి టచ్ లోకి వెళ్లి లాక్ చేసినట్లు కనిపిస్తోంది.

# డివిలియర్స్ చెత్త రికార్డు.. కలిసి రాని యూఏఈ



ఐపీఎల్ 2021లో భాగంగా కేకేఆర్తో జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్లో ఆర్సీబీ ఓటమి పాలైన సంగతి తెలిసిందే. కరోనా విరామం తర్వాత సెకండ్ఫేజ్లో ఆర్సీబీ బ్యాటింగ్ విభాగంలో పడిక్కల్, కోహ్లి, మ్యాక్స్వెల్, కేఎస్ భరత్ కీలకపాత్ర పోషించారు. అయితే సీనియర్ బ్యాటర్ ఏబీ డివిలియర్స్కు మాత్రం యూఏఈ గడ్డ ఏమాత్రం కలిసిరాలేదు. ప్లేఆఫ్స్తో కలిపి డివిలియర్స్ 8 మ్యాచ్ల్లో 17.66 సగటుతో 106 పరుగులు మాత్రమే చేయగలిగాడు. 0,12,11,4, 23, 19, 26,11 ఇవి డివిలియర్స్ యూఏఈ గడ్డపై నమోదు చేసిన స్కోర్లు. ఇందులో ఒక గోల్డెన్ డక్ ఉండడం విశేషం. ఇక మ్యాచ్ విషయానికి వస్తే ఎలిమినేటర్ మ్యాచ్లో కేకేఆర్ 4 వికెట్ల తేడాతో ఘన విజయాన్ని అందుకుంది. 139 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన కేకేఆర్ 19.4 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి చేధించింది. కేకేఆర్ బ్యాటింగ్లో సునీల్ నరైన్ 26 పరుగులతో గేమ్ చేంజర్ కాగా.. గిల్ 29, వెంకటేశ్ అయ్యర్ 26, నితీష్ రాణా 23 పరుగులు చేశారు. అంతకముందు ఆర్సీబీ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 138 పరుగులు చేసింది. సునీల్ నరైన్(4/21) బౌలింగ్లో మెరవడంతో ఆర్సీబీ నామమాత్రపు స్కోరుకే పరిమితమైంది. కోహ్లి 39 పరుగులతో టాప్ స్కోరర్గా నిలవగా.. పడిక్కల్ 21 పరుగులు చేశాడు.

# దర్శకేంద్రుడు మాంచి రొమాంటిక్ గురూ

దర్శకేంద్రుడు రాఘవేంద్ర రావు చాలా కాలం తర్వాత పెళ్లిసందఆ అనే సినిమాతో రాబోతున్నారు. పాతికేళ క్రితం ఆయన దర్శకత్వంలో వచ్చిన సినిమాను ఇప్పుడు పెళ్లిసందఆ అనే టైటిల్ తో మరో సినిమాను తీసి గుర్తు చేస్తున్నారు. రాఘవేంద్ర రావు అంటే ఇండస్ట్రీలో ఎంతో మంది ప్రముఖులతో సినిమాలు చేసిన వ్యక్తి. అలాంటి రాఘవేంద్ర రావు నటుడిగా పెళ్లిసందఆ సినిమాతో పరిచయం అవ్వబోతున్నాడు. అదే విధంగా ఈ సినిమాకు నిర్మాతగా కూడా వ్యవహరిస్తున్నాడు. అందుకే దర్శకేంద్రుడు ఆహ్వానించిన వెంటనే చిరంజీవి మరియు వెంకటేష్ లు ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకలో హాజరు అయ్యారు. ప్రీ రిలీజ్ వేడుకలో చిరంజీవి మాట్లాడుతూ చేసిన వ్యాఖ్యలు అందరి దృష్టిని ఆకర్షించారు.చిరంజీవిని రాఘవేంద్ర రావు బాబాయి అంటూ పిలుచుకుంటూ ఉంటాడు. అలాంటి రాఘవేంద్ర రావు నాకు ఎన్నో సూపర్ హిట్ లను అందించారు. అలాంటి ఒక దర్శకుడితో వర్క్ చేయకుంటే అప్పట్లో మేము ఒక వెలితిగా భావించేవాళ్లం. సినిమాల్లో ఫ్లాప్ లు పడ్డప్పుడు లేదా వ్యక్తిగతంగా ఇబ్బందుల్లో ఉన్నా కూడా నేను ఆయన్ను కొద్ది సమయం కలిసి మాట్లాడేవాడిని అన్నాడు. రాఘవేంద్ర రావు హీరోలను చూసుకునే విధానం ఇండస్ట్రీలో మరెవ్వరు కూడా అలా చూసుకోరు. స్టార్ హీరో అయినా చిన్న హీరో అయినా ప్రతి ఒక్కరిని కూడా ఆయన చాలా లాలిస్తూ తనకు కావాల్సింది చేయించుకుంటాడు. హీరోలకు ఆయన అందుకే అభిమాన దర్శకుడు అవుతాడు అంటూ చిరంజీవి పేర్కొన్నారు.నాకు సురేఖ కు పెళ్లి అయిన కొత్తలో ఒక సినిమా షూటింగ్ ను ముగించుకుని ట్రైన్ లో చెన్నై బయలుజేరాము. ఆ సమయంలో సురేఖ కూడా నాతోనే ఉంది. ఆ ట్రైన్ లో దర్శకుడు రాఘవేంద్ర రావు గారు తో పాటు చిత్ర యూనిట్ సభ్యులం అందరం కలిసి చెన్నై వెళ్తున్నాం. అందరితో పాటు ట్రైన్ లో ఫస్ట్ క్లాస్ బోగీలో కూర్చుని వెళ్లవచ్చు అనుకుంటూ ఉన్నాను. కాని మా ఇద్దరి కొసం ఒక స్పెషల్ కంపార్ట్ మెంట్ ను చూపించారు. అందులోకి వెళ్లి చూడగానే ఫస్ట్ నైట్ సెటప్. ఎప్పుడు ఇదంతా చేయించారు అంటూ నేను ఆశ్చర్యపోయాను. స్వీట్లు.. పండ్లు పూలు అవన్నీ చూసి సురేఖ సిగ్గుతో చచ్చిపోయిందని చిరంజీవి సరదాగా అప్పటి ముచ్చట్లను షేర్ చేసుకున్నారు. రాఘవేంద్ర రావు అంటే రొమాంటిక్ సన్నివేశాలు గుర్తుకు వస్తాయి. చిరంజీవి చెప్పిన ఈ రియల్ లైఫ్ సంఘటన ఆయన ఎంతటి రొమాంటిక్ అనే విషయాన్ని చెప్పకనే చెబుతోంది.



# ఐపీఎల్ రేటింగ్స్.. బీసీసీఐకి బ్యాడ్న్యూస్

ఐపీఎల్ 2021 సీజన్ ఆఖరి దశకు చేరుకుంది. క్వాలిఫయర్ 2తో పాటు ఫైనల్ మ్యాచ్ మాత్రమే మిగిలిఉంది. అయితే క్యాష్రిచ్ లీగ్గా పేరున్న ఐపీఎల్లో ప్రతీసారి వీక్షకుల సంఖ్య రికార్డుస్థాయిలో నమోదవుతూ వస్తుంది. అయితే ఐపీఎల్ 2021 సెకండ్ఫేజ్లో మాత్రం రేటింగ్స్ పడిపోయినట్లు రిపోర్ట్స్లో తేలింది. రిపోర్ట్స్ ప్రకారం ఐపీఎల్ రేటింగ్స్ దాదాపు 15-20 శాతం పడిపోయినట్లు తెలిసింది. కాగా ఐపీఎల్ మ్యాచ్లన్నీ స్టార్స్పోర్ట్స్ నెట్వర్క్ ప్రసారం చేస్తుంది. స్టార్స్పోర్ట్స్ ఇంగ్లీష్, హిందీ చానెళ్లతో పాటు పలు ప్రాంతీయ భాషల్లో మ్యాచ్లు ప్రసారమవుతున్నాయి.అయితే ప్రకటనదారులతో రేటింగ్లు తగ్గడం లేదని.. వీక్షకుల సంఖ్య పడిపోవడం వల్లే ఇలా జరిగిందని ఎంటర్టైన్మెంట్(ఈటీ)లో తేలింది. రేటింగ్ల పతనానికి సంబంధించిన ఖాతాలపై ప్రకటనదారులు పరిహారం కోసం వెతికే అవకాశం ఉన్నట్లు నివేదిక పేర్కొంది. ఇలా ఐపీఎల్ రేటింగ్స్ పడిపోవడం బీసీసీఐకి అంత సానుకూలాంశం కాదు. ఇది ఇలాగే కొనసాగితే ప్రకటనదారుల నుంచి వేలకోట్లు నష్టపోయే అవకాశం ఉంది. కాగా అక్టోబర్ చివరి నాటికి కొత్త




మీడియా హక్కుల టెండర్ను విడుదల చేయాలని బీసీసీఐ యోచిస్తోంది. రాబోయే వారంలో రేటింగ్లు పెరగకపోతే మాత్రం బీసీసీఐకి భారీ నష్టాలు చూసే అవకాశం ఉంటుంది.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190